

గుర్రపుడెక్క తూటుకాడ కమ్మేసిన ఆర్.ఎం డ్రెయిన్



కృష్ణాడెల్టాకు..

మళ్లీ మహర్దశ!

- కన్నీటి కష్టాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధత
- డ్రెయిన్‌ల ఆధునికీకరణకు శ్రీకారం ఇప్పటికే రూ. 680 కోట్లతో ప్రతిపాదనలు
- ఒక్క నల్లమడ డ్రెయిన్‌కే రూ. 480 కోట్లు
- పశ్చిమ డెల్టా సాగునీటి కాల్వలకూ 2007 తర్వాత మళ్లీ ఆధునికీకరణ ఆలోచన
- రూ. 1500 కోట్లతో కొత్త ప్రతిపాదనలకు నీటిపారుదల శాఖ రంగంలోకి..

ఎటు చూసినా కట్టలు కుంగిపోయి గండ్లు పడుతూ... కాల్వలు, డ్రెయిన్‌లలో పూడిక పేరుకుపోయి చివరి భూములవరకు నీరు అందక... షట్టర్‌లు, తూములు దెబ్బతినిపోయి ప్రతి నీటి బొట్టు విలువైనదైన పరిస్థితుల్లో వృధాగా మురుగు కాల్వల్లో కలసిపోయి... వర్షం పడితే చుక్కనీరు కిందికి పోకుండా పొలాలను ముంచెత్తుతూ రైతులకు కడ'గండ్లే' మిగిలితే... ఎంత కష్టమో కదా!. ఒకటో, రెండో సీజన్‌లు కాదు... కొన్ని దశాబ్దాలుగా కృష్ణా డెల్టా పరిధిలోని వరి రైతులకు వీటి ఫలితంగా మిగులుతోంది కన్నీటి కష్టాలే. పంట వేసిన ప్రతి సంవత్సరం వర్షాలు పడకపోతే నీరందక పంటలెండి, వరుణుడు కరుణిస్తే డ్రెయిన్‌ల కట్టలు తెంచుకుని వరద నీరు పొలాలపైపడి పంట మొత్తాన్ని ముంచే స్తుంటే, ఆ దేవునిపై భారం వేయటం మినహా రైతులు చేయగలిగిందేమీ లేకుండాపోయింది. కృష్ణా డెల్టాలో సాగు నీటి కష్టాలు, డ్రెయిన్‌ల దుస్థితితో ఏర్పడుతున్న సమస్యలతో గత కొన్ని దశాబ్దాలుగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వం శుభ వార్త చెప్పింది. మళ్లీ డెల్టా కాల్వల ఆధునికీకరణకు శ్రీకారం చుడుతున్నట్టు తీపికబురు చెప్పటంతో రైతుల్లో సంతోషం కనిపిస్తోంది.

తెనాలి, మార్చి 10, (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో 5,71,351 ఎకరాలు సాగవుతుంటే, ఈ విస్తీర్ణం మొత్తం గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా పరిధిలో ఉంది. ఒక సీజన్‌లో ఖరీఫ్ పంట సాగవ్వాలంటే 69 టీఎంసీల నీరు అవసరం అవుతుంది. అయితే ఈ నీరు అందించటానికి 8,200 క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రకాశం బ్యారేజి దగ్గర నుంచి ప్రధాన కాల్వ వస్తున్నా, దాని నుంచి నీటిని పంట పొలాలకు అందించే కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్, తూర్పు, పశ్చిమ, నిజాంపట్నం కాల్వలు, కొమ్మమూరు, హైలెవల్ ఛానల్స్ కీలకంగా ఉన్నాయి. అయితే వీటిపై ఎప్పుడో 2007లో డెల్టా కాల్వల ఆధునికీకరణ చేపడితే, అవి 2012 వరకు సాగుతూనే వచ్చాయి. వీటిలోనూ పూర్తిశాతం పనులు జరగలేదు. సాగునీటి కాల్వల పనుల్లో 50 నుంచి 60 శాతం మేర పనులు జరిగితే, డ్రెయినేజీ పనులు మాత్రం 70 శాతం వరకు జరిగాయి. ప్రకాశం జిల్లా వరకు ఉన్న కొమ్మమూరు కాల్వ పైన అయితే రూ. 408 కోట్ల ఆధునికీకరణ పనులు అసలు జరగనేలేదు. ఆ నిధులు రద్దయిపోవటంతో రైతులకు ఇబ్బందులు మరింత పెరిగిపోయాయి. అయితే తాజాగా నీటిపారుదల శాఖ డ్రెయినేజీ పనులకు సంబంధించి కొన్ని పనులకు ఇప్పటికే నాబార్డ్‌కు ప్రతి పాదనలు పంపితే, మరికొన్ని పనులకు సంబంధించి మరోసారి మరికొన్ని పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధమవుతోంది. ఇదిలా ఉంటే, డెల్టా కాల్వల ఆధునికీకరణ పనులకోసం మళ్లీ రంగం సిద్ధం చేస్తున్నామని, దీనికి సంబందించిన పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలు పంపాలని నీటి పారుదల శాఖకు ఆదేశాలు కూడా అందాయి. అయితే వీటిని సిద్ధం చేయటానికి మాత్రం నీటిపారుదల శాఖకు మరో మూడు సీజన్‌ల కాలం పట్టే పరిస్థితి ఉంది.

డ్రెయిన్‌ల మరమ్మతుల కోసం రూ. 680 కోట్లతో ప్రతిపాదనలు

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని డ్రెయిన్‌ల మరమ్మతులకోసం నీటిపారుదల శాఖ రూ. 680 కోట్లతో ప్రతిపాదనలను తాజాగా నాబార్డ్‌కు పంపింది. వీటిలో ఒక్క నల్లమడ వాగుకో సంమే రూ. 480కోట్ల ప్రతిపాదనలు పంపితే, మిగిలిన రూ. 200 కోట్లతో 60 కి.మీ టర్ల పొడవున్న రేపల్లె మెయిన్ డ్రెయిన్, 51 కి.మీ టర్ల పొడవున్న భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌ల, మరి కొన్ని చిన్న డ్రెయిన్‌ల మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. వీటిలో రూ. 140 కోట్ల ప్రతిపాదనలు ఇప్పటికే నాబార్డ్‌కు చేరిపోతే, మిగిలిన ప్రతిపాదనలు పంపే పనిలో ఉన్నామని అధికారులు చెబుతున్నారు. ఆర్.ఎం డ్రెయిన్‌పై నిజాంపట్నం దగ్గరున్న పాలరేవు ఔట్‌ఫాల్ స్లూయిజ్ వెడల్పు పెంచే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఇక్కడ సముద్రం నీరు వెనక్కు రాకుండా ఆపేందుకు స్లూయిజ్ నిర్మించారు. అయితే దీనికి 10 ఖానాలు మాత్రమే ఉండటంతో సావ ం ర్థ్యం సరిపోవటంలేదని, దానిని మరో 10 ఖానాలు పెంచి, మొత్తం 20 ఖానాలతో స్లూయిజ్‌ను వెడల్పు చేయాలని నిర్ణయించారు. ముంపునీరు త్వరగా సముద్రంలోకి వెళ్లటానికి ఇది ఉపయోగపడుతుంది. ఇవికాక మిగిలిన డ్రెయిన్‌ల కట్టలు బలపరచటం, డ్రెయిన్‌లలో ప్రధాన సమస్యగా ఉన్న పూడిక తీయటం, వంటి పనులు చేయాల్సి ఉంది.

నల్లమడకు మోక్షం లభించినట్టేనా!

నల్లమడ డ్రెయిన్ కిందున్న లక్ష ఎకరాల ముంపు సమస్యకు శాశ్వత

(మిగతా 6వ పేజీలో)


పి.వి.పాలెం దగ్గర సబ్ డెయిన్ షట్టర్ ధ్వంసమై కాంక్రీట్ దిమ్మెలు పగిలిపోయిన చిత్రం


బుర్రిపాలెం వద్ద డ్రెయిన్ అడ్డుగా ఉన్న తూములు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.22 (మంగళవారం)
సహరి : 5.02 (బుధవారం)

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

కృష్ణా డెల్టా కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టటానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం సూచించింది. వీటిని ఈ సీజన్ నుంచే మొదలు పెడుతున్నాం. అయితే డ్రెయిన్‌ల మరమ్మతులకు, ఆధునికీకరణ పనులకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. సుమారు రూ. 680 కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రతిపాదనల్లోకోరాం. ఇవికాక వచ్చే సీజన్‌లో చేయాల్సిన అత్యవసర మరమ్మతులకోసం ఓ అండ్ ఎం కింద రూ. 40 కోట్ల ప్రతిపాదనలు కూడా ఇప్పటికే పంపించేశాం. మరి కొద్ది రోజుల్లో నిధుల మంజూరు ఉత్తర్వులు రావచ్చు. వచ్చిన వెంటనే పనులకోసం టెండర్లు పిలుస్తాం.

- వెంకటరత్నం, నీటిపారుదల శాఖ ఎస్ఈ గుంటూరు.


చేప ఎక్కడబ్బా...


ఇదిగో ఇక్కడుంది..


ఇవాళ్టికి ఓకే..

- గుంటూరు (ఆంధ్రజ్యోతి)

గుంటూరు చుట్టుగుంట చెరువులో కనిపించే తెల్ల కొంగలు ఒక కొత్త అందాల లోకాన్ని తలపిస్తుంటాయి. చేపల వేటలో భాగంగా చెరువులో వాటి విన్యాసాలు కనువిందు చేస్తున్నాయి. మార్నింగ్ వాక్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ ఈ తెల్ల బంగారు లోకం చూసి కొత్త అనుభూతికి లోనవుతుంటారు.

అక్రమార్కులకు అందలం

అటకెక్కిన రూ. 347 కోట్ల అవినీతి నివేదిక

- నెలలు దాటినా చర్యలు శూన్యం
- అక్రమాలకు పాల్పడిన వారికి అందలాలు
- మార్కెటింగ్ శాఖలో చిదంబర లీలలు

గత ప్రభుత్వ హయాంలో గుంటూరు మిర్చి యార్డు లో భారీ అవినీతి జరిగింది. అక్కడ జరిగిన అవినీతి, అక్రమాలపై అందిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి రూ.347 కోట్ల మేర అవినీతి జరిగిందని గత ఏడాది నవంబర్‌లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అప్పటి యార్డు ఛైర్మన్,మార్కెటింగ్ అధికారులు,ఉద్యోగుల పై చర్యలకు సిఫార్సు చేశారు. ఇదంతా గత ఏడాది డిసెంబర్ లో వెలుగులో కి వచ్చింది. అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ వ్యవహారంలో ఇక ఏదో జరిగిపోతుందని అందరూ భావించారు. .కానీ అలా ఏమీ జరగలేదు. ఎవరి పైనా ఏ చర్య తీసుకోలేదు. పైగా విజిలెన్స్ నివేదిక వచ్చిన తరువాత కొందరికి కొత్తగా పోస్టింగ్‌లు ఇచ్చారు.మరికొందరిని ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టారు. టోటల్ గా చెప్పాలంటే మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు విజిలెన్స్ ఇచ్చిన నివేదికను,చేసిన సిఫార్సు లను అటకెక్కించారు.


గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం

గుంటూరు సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్లలో గుంటూరు మిర్చి యార్డు ను అవినీతి,అక్రమాలకు అడ్డాగా మార్చిన వారిపై మార్కెటింగ్ శాఖ ఉదాసీనత ప్రదర్శిస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. వారి అక్రమాలపై విజిలెన్స్ నివేదిక వచ్చిన తరువాత కూడా చర్యలకు ఉపక్రమించకపోవటం పట్ల విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. గత ఏడాది నవంబర్‌లోనే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు చూస్తుంటే విజిలెన్స్ నివేదికను మార్కెటింగ్ శాఖ పూర్తిగా పక్కన పెట్టేసినట్లు అర్థం అవుతున్నది. ఇందుకోసం ఉన్నత స్థాయి లాబీయింగ్ నడిచినట్లు ఆరోపణలు వస్తున్నాయి. యార్డులో జరిగిన అవినీతిలో మొత్తం 20 మంది కీలక పాత్ర పోషించినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో మార్కెటింగ్ శాఖలోని ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. పలువురు యార్డు సెక్రటరీలు, సూపర్ వైజర్లు ప్రధాన పాత్రధారులుగా ఉన్నట్లు తేల్చారు. వారి వల్లనే వివిధ రూపాల్లో యార్డుకు రావాల్సిన రూ.347 కోట్ల ఆదాయానికి గండి పడినట్లు నిర్ధారించారు. ఒక సెక్రటరీ లైసెన్స్ రెన్యువల్ వ్యవహారంలో పూర్తి స్థాయి గుత్తాధిపత్యం ప్రదర్శించినట్లు కూడా నివేదిక లో విజిలెన్స్ స్పష్టం చేసింది.

మెమో ఇంకా రాలేదా ..?

విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి చేరిన తరువాత బాధ్యులైన అధికారులు, ఉద్యోగుల పై చర్యలు నిమిత్తం మెమో జారీచేస్తుంది. ఆ మెమో ఆధారంగా నే మార్కెటింగ్ శాఖ చర్యలకు ఉపక్రమించటం జరుగుతుంది. ప్రభుత్వానికి నివేదిక చేరిన అతి తక్కువ సమయంలోనే ఈ మెమో జారీ అవుతుంది. యార్డు వ్యవహారం మాత్రం అందుకు భిన్నంగా జరిగింది. నివేదిక వెళ్లిన నాలుగు నెలల తర్వాత కూడా ఏ విధమైన స్పందన కనపడటం లేదు.ప్రభుత్వం అసలు మెమోనే జారీ చేయలేదా. ఒక వేళ ప్రభుత్వం మెమో జారీచేసిన తర్వాత కూడా చర్యలకు మార్కెటింగ్ శాఖ మీనమేషాలు లెక్కిస్తుందా..? అన్న దానిపై చర్చ జరుగుతున్నది. గత ప్రభుత్వ హయాంలో యార్డు లో ఏకచత్రాధిపత్యం సాగించిన కొందరికి మంచి స్థానాల్లో పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. ఎవరిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఏవిధమైన చర్యలు చేపట్టకుండా ఉండేందుకు వాళ్లే పావులు కదుపుతున్నారన్న ప్రచారం జరుగుతున్నది. విజిలెన్స్ నివేదికను అటక్కెకించటంలో కూడా వాళ్ల పాత్రే కీలకంగా ఉన్నట్లు సమాచారం. వేరే వ్యవహారంలో రూ. కోట్ల ముడుపులు ముట్టజెప్పినందుకు నజరానాగా ఈ వ్యవహారం పక్కన పెట్టమని కోరినట్లు ప్రచారం సాగుతోంది.

20 రోజులు.. రూ. 50 కోట్ల లక్ష్యం



- మార్కెట్ ఫీజుల వసూళ్లలో ఏఎంసీల వెనకడుగు
- బాపట్లలో ప్రకృతి విపత్తులు
- పల్నాడులో సాగునీటి కష్టాలు
- గుంటూరులో కొనుగోళ్ళ సెస్సు పెండింగ్

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లలో మార్కెట్ ఫీజు వసూళ్లు ఈ ఏడాది అంత ఆశాజనకంగా లేవు. మరో 20 రోజుల్లో 2024-25 ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుండగా నేటికీ 76 శాతం మధ్యనే వసూళ్లు జరిగాయి. ఇప్పటినుంచి కేవలం ఒక్క గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో మిర్చి లావాదేవీలు కారణంగా కొంతవరకు మార్కెట్ ఫీజు వసూళ్లకు అవకాశం ఉన్నది. మిగతా ఏఎంసీల పరిధిలో కలెక్షన్స్ నామమాత్రంగానే జరుగుతాయి. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ రాష్ట్ర శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏఎంసీలకు కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఆ శాఖ డైరెక్టర్ అండ్ కమిషనర్ విజయ సునీత ఏఎంసీల సెక్రెటరీలు, ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, డీడీ, ఏడీలతో సమావేశం కావాలని నిర్ణయించారు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు జిల్లాకు మార్కెట్ ఫీజు వసూళ్లను రూ. 133.69 కోట్లుగా మార్కెటింగ్ శాఖ లక్ష్యాన్ని నిర్దే శించింది. అందులో ఇప్ప టివరకు 102.81 కోట్లు వసూలు చేసి 76.91 శాతం లక్ష్యానికి చేరుకొన్నది. పల్నాడు జిల్లా లోని 12 ఏఎంసీలైన నరసరావుపేట, చిలకలూరిపేట, రొంపిచర్ల, సత్తెనపల్లి, క్రోసూరు, రాజుపాలెం, పిడుగురాళ్ల, గురజాల,మాచర్ల, ఈపూరు, వినుకొండ, దుర్గికి కలిపి రూ.32.14 కోట్లు లక్ష్యం నిర్దేశించగా ఇప్పటి వరకు కేవలం రూ. 21 కోట్లు వ సూ త్రమే వసూళ్లు జరిగాయి. బాపట్ల జిల్లాలో ఏఎంసీలకు రూ. 30.21 కోట్లు లక్ష్యం ఇవ్వగా రూ. 22.65 కోట్లు వసూళ్లు చేశారు. ఈ విధంగా మూడు జిల్లాలకు కలిపి రూ. 196.08 కోట్లు లక్ష్యం కాగా రూ. 146.46 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ. 50 కోట్ల లోటు ఉన్నది.

మార్కెట్ ఫీజు కలెక్షన్ పైనే ఏఎంసీలు ఆధారపడి ఉన్నాయి. అయితే ఉమ్మడి జిల్లాలో కొన్ని మాత్రమే కార్యకలాపాలు జరిగే ఏఎంసీలు ఉండగా మిగతావాన్ని చెక్‌పోస్టులలో వసూలు చేసే సెస్సు పైనే ఆధారపడుతున్నాయి. గుంటూరు జిల్లాలో పేరుకు ఎనిమిది వ్యవసాయ మార్కెట్ కమిటీలుండగా వీటిల్లో గుంటూరు, దుగ్గిరాల, తెనాలి మాత్రమే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అలానే పల్నాడులో 12 ఏఎంసీలున్నప్పటికీ గురజాల ఒక్కటే కార్యకలాపాలు జరిపే యార్డుగా ఉన్నది. బాపట్లలో నాలుగు ఏఎంసీలుండగా ఇవన్నీ ధాన్యం, అపరాలపై ఆధారపడుతున్నాయి. కాగా గతేడాది రబీ సీజన్‌లో సాగర్ కాలువలకు సాగునీరు విడుదల చేయలేదు. దాంతో పంట విస్తీర్ణం తగ్గి మార్కెట్ ఫీజు వసూళ్లపై దాని ప్రభావం పడింది. బాపట్ల జిల్లా లో ఈ ఏడాది ప్రకృతి విపత్తులు సంభవించ డంతో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పంట లు దెబ్బతిన్నాయి. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ సంవత్సరం మిర్చి ధర పతనం అయింది. గతేడాది క్వింటాల్ రూ. 18 వేల వరకు ఉంటే ఈ సంవత్సరం మార్కెట్ ప్రారంభంలో రూ. 9 వేల నుంచి రూ. 11వేల మధ్య నే ఉన్న ది. ఇది కూడా మార్కెట్ ఫీజు తగ్గడానికి కారణంగా మారింది. మరో వైపు పౌరసర ఫరాల సంస్థ చేస్తోన్న ధాన్యం కొనుగోళ్లు, సీసీఐ చేసిన పత్తి కొ నుగోళ్లపై ఇంకా ఏఎంసీలకు మార్కెట్ ఫీజులు జమ కాలేదు. మార్కెట్ ఫీజు వసూళ్లు తగ్గ డానికి వీటన్నింటిని కారణాలుగా మార్కె టింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లా ఏఎంసీలలో ఫీజుల వసూళ్లు ఇలా...

మార్కెట్ కమిటీ	లక్ష్యం (రూ.కోట్లలో)	వసూళ్లు చేసిన మొత్తం (రూ.కోట్లలో)
ఫిరంగిపురం	1.95	1.19
మంగళగిరి	3.10	2.10
తాడికొండ	2.10	1.46
గుంటూరు	106	79.20
పొన్నూరు	6.95	6.10
ప్రత్తిపాడు	3.72	3.31
తెనాలి	6.60	6.18
దుగ్గిరాల	3.27	3.24
పల్నాడు (అన్ని ఏఎంసీలు)	32.14	21
బాపట్ల (అన్ని ఏఎంసీలు)	30.21	22.65
మొత్తం	196.08	146.46

శంకర్‌విలాస్ బ్రిడ్జి పనుల్లో..ముందడుగు

- ఆర్‌వోబీకి టెండర్ నోటిఫికేషన్ జారీ
- రూ. 98 కోట్లు అంచనావిలువగా పేర్కొన్న ఆర్ అండ్ బీ
- 13 నుంచి టెండర్ షెడ్యూల్స్ డౌన్‌లోడింగ్‌కు అవకాశం
- ఈ నెల 28వ తేదీ వరకు దాఖలుకు గడువు



శంకర్‌విలాస్ ఆర్‌వోబీ(రైల్వే వోవర్ బ్రిడ్జి) నిర్మాణ పనులకు మరో అడుగు ముందుకు పడింది. ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టబోతున్న రోడ్లు, భవనాల శాఖ టెండర్ నోటిఫికేషన్‌ని విడుదల చేసింది. ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో ఆన్‌లైన్ టెండర్లను పిలిచింది. టెండర్. ఏపీ ఈప్రొక్యూర్‌మెంట్. జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి టెండర్ షెడ్యూల్స్ డౌన్‌లోడింగ్‌కు అవకాశం కల్పించింది. అలానే వాటిని దాఖలు చేసేందుకు ఈ నెల 28వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు గడువు విధించింది. పూర్తి వివరాలను ఏపీఈ ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడొచ్చని ఆర్ అండ్ బీ ఇంజనీర్-ఇన్-చీఫ్ వీ రామచంద్ర పేర్కొన్నారు.

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో పెరిగిన ట్రాఫిక్ రద్దీతో కీలకమైన శంకర్‌విలాస్ ఆర్‌వోబీపై వాహనాల కదలికలు సాఫీ గా జరగడం లేదు. పైగా ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగి దాదాపుగా ఐదు దశాబ్దాలు కావొస్తుండటంతో పటిష్టత కూడా బలహీనపడింది. దీంతో ఈ బ్రిడ్జి స్థానంలో ఒక ఎలివేటెడ్ నాలుగు వరసల ఆర్‌వోబీని నిర్మించేందుకు 2004లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతిపాదన వచ్చింది. అయితే అప్పటి నుంచి ఈ ప్రతిపాదన ఫైళ్లకే పరిమితమైంది. గత ఏడాది సేతుబంధన్ స్కీమ్ కింద శంకర్‌విలాస్ ఆర్‌వోబీని చేర్చినా నిధులు మంజూరు కాలేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఏ ప్రాంతానికి వెళ్లినా శంకర్‌విలాస్ ఆర్‌వోబీ సమస్య గురించే ప్రజలు చెప్పారు. ఆ సందర్భంలో ఆయన తాను ఎంపీగా గెలవగానే శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి నిధులు మంజూరు చేయించి వేగవంతంగా పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు పెమ్మసాని తొలుత దీనినే చేపట్టారు. అధికారులతో పలు దఫాలు సమావేశాలు నిర్వహించి డీపీఆర్‌ని సిద్ధం చేయించారు.

డీపీఆర్‌ని కేంద్ర ప్రభుత్వానికి నివేదించి రూ. 98 కోట్లను బ్రిడ్జి నిర్మాణానికి నాలుగు నెలల క్రితం మంజూరు చేయించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ముడిపడి ఉన్న ప్రభుత్వ శాఖలన్నింటిని ఒక తాటి పైకి తీసుకొచ్చి సమన్వయం చేస్తున్నారు. దీంతో గుంటూరు నగరపాలకసంస్థ ప్రప్రథమంగా బ్రిడ్జి నిర్మా ణానికి అవసరమైన స్థలాన్ని సేకరించే ప్రక్రియని ప్రా రంభించింది. ఇరువైపులా ప్రభుత్వ భవనాలను తొలగిస్తున్నది. ప్రభుత్వ మహిళ కళాశాల ప్రహరీగోడని కూడా రెండు రోజుల క్రితం తొలగించింది. ప్రైవేటు ఆస్తుల యజమానులకు నోటీసులు ఇచ్చి నష్టపరిహా రం, టీడీఆర్ బాండ్లను సిద్ధం చేస్తున్నది. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జిని కూల్చివేసిన సందర్భంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు పోలీసు శాఖ ద్వారా ప్రణాళికని కూడా సిద్ధం చేయించారు. మూడొంతెనల వద్ద నూతన ఆర్‌యూబీని నిర్మింప చేసి కొంత ట్రాఫిక్ అటువైపుగా వెళ్లేలా చేశారు. కంకరగుంట ఆర్‌యూబీ వద్ద కూడా ఆక్రమణలను తొలగించాలని నిర్ణయించారు. విద్యుత్ శాఖ ఒక సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను తొలగించాల్సి ఉన్నది. రైల్వే శాఖ తన భాగం వరకు బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలి. వీటన్నింటిని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి ఏడాదిలోనే బ్రిడ్జి నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు.

బీఈడీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో పది మంది అరెస్టు
వినుకొండ వివేకానంద కళాశాల కరస్పాండెంట్‌దే కీలకపాత్ర ● ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడి

ఆకలి కేకలు
- ఎస్సీ కళాశాల హాస్టల్స్‌లో నాణ్యతలేని భోజనం
- రైస్ కుక్కర్లతో విద్యార్థులే వండుకుంటున్న వైనం
- కొందరికి అన్న క్యాంటీనే ఆధారం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

8

మంగళగిరిలో ఉచిత బస్సు సేవలు

- సీఎస్ఆర్ నిధుల కింద రెండు బస్సులు మంజూరు
- ఒకటి ఎయిమ్స్‌కు.. మరోటి నృసింహాలయానికి..
- ఉచిత బస్సు సర్వీసులను ప్రారంభించిన మంత్రి లోకేశ్



బస్సులను ప్రారంభించి ఎయిమ్స్ డైరెక్టర్ శాంతా సింగ్‌కు తాళం అందజేస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో ఉచిత ఎలక్ట్రిక్ బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం ఉండవల్లిలోని నివాసంలో జెండా ఊపి ఈ బస్సులను ప్రారంభించారు. వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రికి, పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి వచ్చే ప్రజలు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ సీఎస్ఆర్ నిధుల నుంచి బస్సులను సమకూర్చాల్సిందిగా మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కోరారు. లోకేశ్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సదరు సంస్థ రూ.2.4 కోట్ల విలువైన రెండు అత్యాధునిక ఒలెక్ట్రా ఏడు మీటర్ల ఎలక్ట్రిక్ బస్సులను అందజేసింది. ఒక బస్సు మంగళగిరి ఆర్టీసీ బస్టాండు నుంచి ఎన్ఆర్ఐ జంక్షన్, డీజీపీ కార్యాలయం మీదుగా ఎయిమ్స్‌కు నడుస్తుంది. మరో బస్సు మంగళగిరి బస్టాండు నుంచి ఎన్నారై జంక్షన్ మీదుగా పానకాలస్వామి గుడివరకు నడుస్తుంది. ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ అండ్ ఎండీ కేవీ ప్రదీప్, ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ శాంతా సింగ్ అహెంతెమ్, డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, నృసింహాలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, టీటీడీ బోర్డు మెంబరు తమ్మిశెట్టి జానకీదేవి, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, టీడీపీ నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, కొల్లి శేషు, తాళ్ల అశోక్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా వివా 'ఐబీ గ్రాడ్యుయేషన్' డే వేడుకలు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వివా ది స్కూల్‌లో అంతర్జాతీయ స్థాయి ఐబీ (ఇంటర్నేషనల్ బాకలారియేట్) విద్యావిధానంలో ప్రీ ప్రైమరీ విద్యను ముగించుకుని ప్రైమరీ విద్యకు, ప్రైమరీ విద్యను ముగించుకొని మిడిల్ స్కూలు ప్రవేశం పొందుతున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేడ్ 1, గ్రేడ్ 6 తరగతులకు ప్రవేశించనున్న విద్యార్థులను అభినందిస్తూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక, శాస్త్రీయ, ఆధునిక నృత్యాలు, గీతాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కేఎస్.రావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ ప్రోగ్రాం సంధానకర్త కె.మాధవి, జూనియర్ క్యాంపస్ హెడ్ మామిళ్లపల్లి వేదవాణి, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుబారాకు అడ్డుకట్ట పడేనా?

- అమరేశ్వరాలయంలో నిబంధనలు ఉల్లంఘించి మరీ ఖర్చులు
- కోర్టును ఆశ్రయించిన భక్తుడు



అమరేశ్వరస్వామి

అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దినదినాభివృద్ధి చెందుతూ గ్రూప్ 2 ఆలయంగా గుర్తింపు పొందిన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో స్వామివారి ఆదాయంపై జరుగుతున్న దుబారా ఖర్చులకు అడ్డుకట్ట పడేనా అని భక్తులు చర్చించుకుంటున్నారు. ఆలయాన్ని పునర్నిర్మించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఆలయ నిర్వహణకు, ఆలయంలో పనిచేసే అర్చకులకు, వివిధ సేవలు చేసే వారికి వందల ఎకరాలు దానం చేశారు. అమరేశ్వరునికి తెలంగాణ రాష్ట్రంలోని దెందులూరులో 485 ఎకరాలు, అమరావతిలో 67, దాములూరులో 5, దమ్మాలపాడులో 110, మాదలలో 90 ఎకరాలు ఉండగా దెందులూరులోని భూమికి కౌలు ద్వారా రూ. 4 లక్షలు, ఇక్కడ ఉన్న భూములకు రూ. 26 లక్షలు ఆదాయం వస్తుంది. ఇక హారాండీలు, ఆర్జిత సేవల ద్వారా రూ. 3.2 కోట్ల ఆదాయం వస్తుంది. వస్తున్న ఆదాయంలో అర్చకుల, ఉద్యోగుల జీతభత్యాలు 30 శాతం ఖర్చు చేయాల్సి ఉండగా అధికంగా 45 శాతం ఖర్చు చేస్తున్నారు.

రాజకీయ జోక్యంతో...

విజయవాడకు చెందిన మార్కండేయ శర్మ అనే భక్తుడు ఆలయంలో స్వామి వారి ఆదాయం ఖర్చు, అర్చకుల విధులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకం, పెంచిన జీతాలు తదితర అంశాలపై అక్రమాలు జరుగుతున్నాయనీ, ఓ వైసీపీ నాయకుడి కారు డ్రైవర్‌కు కూడా జీతం ఇచ్చారని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై వివరణ ఇవ్వాలని దేవదాయ కమిషనర్‌ను కోర్టు ఆదేశించగా ఆలయ అధికారుల నిర్వాకంతో తగిన సమయంలో వివరణ ఇవ్వలేదు. దీంతో పిటిషనర్ మళ్లీ కోర్టును ఆశ్రయించగా కోర్టు కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి ఆలయంలో లావాదేవీలకు సంబంధించిన నివేదికను అందజేయాలని ఆదేశించింది. దీంతో కమిషనర్ ఇద్దరు డీసీలతో విచారణ కమిటీ ఏర్పాటు చేసి వారు తయారు చేసిన రిపోర్టును కోర్టుకు సమర్పించారు. ఆలయానికి ఆదాయం రూ. 3.5 కోట్లు ఉండగా, 30శాతం మాత్రం జీతాలకు ఖర్చు చేయాల్సి ఉంది. కానీ 45 శాతం ఖర్చు చేస్తున్నారు. పెంచిన జీతాలు, కాంట్రాక్టు సిబ్బంది నియామకం, ఇతర దేవాలయాల నుంచి ఇక్కడికి ఉద్యోగులు రావడం ఖర్చు పెరుగుదలకు కారణాలుగా గుర్తించారు. పెంచిన జీతాలు తగ్గించాలనీ, ఇతర దేవాలయాల నుంచి వచ్చిన వారిని వెనక్కు పంపించాల్సి ఉంది. ఈ మేరకు కోర్టు ఉత్తర్వులను కూడా అమలు చేయాల్సి ఉంది. రాజకీయ నాయకుల జోక్యంతో చర్యలు కొంత ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తుంది. నిబంధనలు ఉల్లంఘించి ఆలయ ఆదాయంలో అదనంగా రూ. 50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. కొంతమంది ఉద్యోగులను మాతృసంస్థకు పంపేందుకు నోటీసులు ఇవ్వగా, కొందరిని ఆపేందుకు స్థానిక ప్రజాప్రతినిధి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సదావర్తి సత్రంలో కూడా..

ఆలయానికి అనుబంధంగా ఉన్న సదావర్తి సత్రంలో కూడా ఆదాయం కన్నా ఖర్చు అధికమౌతుంది. సత్రానికి మద్రాసులో 471 ఎకరాలు, కొగంటివారిపాలెంలో 71 ఎకరాలు భూములు ఉండగా మద్రాసులోని భూముల ద్వారా సత్రానికి రావాల్సిన రూ. 60 కోట్లు వైసీపీ నాయకుల కుట్రతో వెనక్కిపోయాయి. కోగంటివారిపాలెం భూములకు రూ.9 లక్షలు, రూమ్ అద్దెల ద్వారా రూ. 2లక్షలు ఆదాయం వస్తుంది. దీంతో సత్రం ఉద్యోగులకు కూడా జీతాలు అందడం లేదు. దీంతో అమరేశ్వరాలయానికి సత్రాన్ని దత్తత తీసుకోవడం ఎందుకని పిటిషనర్ ప్రశ్నించడంతో దానిని దత్తత నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

కృష్ణా డెల్టాకు.. మళ్లీ మహర్దశ!

(5వ పేజీ తరువాయి)

పరిష్కారాన్ని చూపే దిశగా కూటమి ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఆధునికీకరణ పనులు దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమయిన తరుణంలో ఏకంగా డ్రెయిన్ వెడల్పు చేయటం కీలకం కావటంతో, ఆ పనులను చేయాలని నిర్ణయించటంతో ఇక్కడి రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. పొన్నూరు, బాపట్ల, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల పరిధిలో ఉన్న ఈ డ్రెయిన్ సమస్య ఇప్పటి కాదు. దీనిపై 1964 నుంచి ప్రభుత్వాలు కమిటీలు వేస్తూనే వచ్చాయి. అప్పటి మిత్ర కమిటీ దగ్గర నుంచి 2006 వరకు సాగిన నిపుణుల కమిటీలు అనేక సూచనలు చేస్తే, వాటిని ఇప్పటి వరకు బుట్టదాఖలు చేస్తూ వచ్చారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం అప్పటి మిత్ర కమిటీ నుంచి తాజా కమిటీలు చూపిన వాటిలో ప్రధానమైన ఆధునికీకరణ పనులకే ప్రాధాన్యం ఇచ్చారు. దీనికి రూ. 480 కోట్ల ఖర్చవుతున్నప్పటికీ వాటిని పూర్తిచేయాలనే నిర్ణయానికి రావటంతో, ప్రతిపాదనలుకూడా ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ పంపింది. నల్లమడ డ్రెయిన్ ఇప్పటి వరకు 300 సీ (కోఎఫిషియంట్ ఆఫ్ డిశ్చార్జ్) వ్యాల్యూ ప్రకారం ఉంది. అయితే దీనిని 500 సీ వాల్యూ ప్రకారం వెడల్పు చెయ్యాలి. దీనికోసం అదనంగా భూమినికూడా సేకరించాల్సి ఉంటుంది. ఈ రూ. 480 కోట్లలో రూ. 300 కోట్లు డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు కేటాయిస్తే, మిగిలిన రూ. 180 కోట్లు భూ సేకరణ కోసం కేటాయించారు. ఈ 500 సీ వాల్యూ ప్రకారం డ్రెయిన్ వెడల్పు జరిగితే పంట ముంపునకు గురవకుండా చేతికి అందుతుంది. ఈ పనులను గత చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పుడు 2016లోనే చెయ్యాలని నిర్ణయించారు. అయితే అప్పట్లో నిధులు మంజూరు చేయటం, టెండర్లు పిలవటం వరకు జరిగినా, పనులు మాత్రం మొదలు కాలేదు. తర్వాత వచ్చిన ప్రభుత్వం అసలు దీనిని పక్కన పెట్టేసింది. దీంతో రైలకు కష్టాలు మరింత పెరిగాయి. అయితే మళ్లీ కూటమి సర్కారు వచ్చాక ఈ పనుల్లో కదలిక రావటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

మళ్లీ డెల్టా అధునికీకరణకు శ్రీకారం

కృష్ణా డెల్టా అధునికీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2007లో ఆధునికీకరణ జరగటం మినహా తర్వాత వీటిపై పెద్దగా పనులేవీ జరిగిన దాఖలాలు లేవు. దీంతో డెల్టాలోని కాల్వలన్నీ శిథిల స్థితికి చేరిపోయాయి. ఈ తరుణంలో ఆధునికీకరణ ఒక్కటే మార్గం కావటంతో దీనికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. దీనికోసం ప్రతిపాదనలు పంపాలను నీటిపారుదల శాఖకు ఆదేశాలు పంపింది. ఈ మేరకు అంచనాలు రూపొందించే పనిలో నీటిపారుదల శాఖ ఉంది. గతంలో డెల్టా కాల్వల ఆధునికీకరణ రూ. 1024 కోట్లు కేటాయించారు. అయితే వీటిలో 60 శాతం నిధులే సద్వినియోగం అయ్యాయి. రూ. 408 కోట్ల విలువైన కొమ్మమూరు కాల్వ పనులు మాత్రం ఒక్కటి కూడా జరగలేదు. దీంతో ఈ కాల్వపై సాగునీటి కష్టాలు మరింత పెరిగిపోయాయి. నీరు పుష్కలంగా ఉన్నప్పుడు కట్టలకు గండ్లు పడుతున్న పరిస్థితి కూడా ఉంది. అయితే ఆధునికీకరణ చేస్తే ఈ కాల్వ కిందున్న రైతులకు కష్టాలు తీరినట్టే. అయితే ఈసారి ఆధునికీకరణ చేపట్టాలంటే కనీసం రూ. 1500 కోట్ల వరకు ఖర్చవుతుందని నీటిపారుదల శాఖ అంచనా వేస్తోంది. అయితే అంత మొత్తం ఇప్పుడున్న పరిస్థితుల్లో మంజూరవుతుందా! లేక కుదింపు వంటి కార్యక్రమం ఉంటుందా అనే అనుమానాలుకూడా ఉన్నాయి. ఏదిఏమైనా దీనికి సంబంధించిన డిటైల్డ్ ఎస్టిమేషన్స్ పూర్తికావాలంటే కనీసం మూడు ఖరీఫ్ సీజన్‌లు పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఏవిధంగా ముందుకు వెళుతుందనేది చూడాల్సిందే.


రైతు రుణం ఉపశమన చట్టం అమలు చేయాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గుంటూరు సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల ఆత్మహత్యలను నివారించేందుకు కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు రుణం ఉపశమన చట్టం' దేశవ్యాప్తంగా అమలు చేయాలని మాజీ మంత్రి, అఖిల భారత రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా జరిగిన సభకు రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు అధ్యక్షత వహించారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ మండలి తీసుకున్న నిర్ణయం మేరకు దేశంలోని అన్ని రాష్ట్ర కేంద్రాల్లో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2014 ఎన్నికలకు ముందు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఆ తర్వాత కొద్ది కాలానికి ఈ సిఫార్సులు అమలు చేయడం సాధ్యం కాదని మోడీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది అన్నారు. వ్యవసాయంలో కార్పొరేటీకరణను అనుమతించడానికి జరుగుతున్న కుట్రను రైతులు ఉత్తరాది రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఉద్యమించి నిలువరించారని తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధరలు రాలేదన్నారు. తెలంగాణ, కర్ణాటక, కేరళలో రైతులకు కనీసం మద్దతు ధర రాకపోతే ధాన్యానికి బోనస్ ఇస్తున్నారని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గుంటూరు చానల్ అభివృద్ధి, వరికపూడిసెల ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యం చేస్తున్న టీడీపీ ప్రభుత్వం రూ.80వేల కోట్లతో బనకచర్ల చేపడతామని చెప్పడం ద్వారా కాంట్రాక్టర్లను బాగు చేయడం కోసమేనన్నారు. ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, సభకు అధ్యక్షత వహించిన సీనియర్ రైతు నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ రైతులకు మద్దతుగా రాకపోతే కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద రైతులను ఆదుకోవాల్సి ఉందన్నారు. కోకో రైస్ సంగం నాయకులు శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు సంగం అధ్యక్షులు వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, వివిధ రైతు సంఘాల నాయకులు సి.హెచ్. వెంకటేశ్వర్లు,చుండూరు రంగారావు, నల్లమడ రైతు సంఘం నాయకుడు కొల్లా రాజమోహన రావు, ఎం హరిబాబు, పి జమలయ్య, వెంకటరెడ్డి, ఆంజనేయులు, ఎం సూర్యనారాయణ. హనుమారెడ్డి, వివిధ రైతు సంఘాల జిల్లా నాయకులు కంచు మాటి అజయ్ కుమార్, ఉల్లిగడ్డ నాగేశ్వరావు, పచ్చల శివాజీ, వేల్పూరి నరసింహారావు, కొల్లి రంగారెడ్డి ఈమని అప్పారావు, బైరగాని శ్రీనివాసరావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ షఫి, మెడికల్ యూనియన్ రాష్ట్ర నాయకులు కుమార్, సలీం తదితరులు ప్రసంగించారు.

బాపట్ల ఎడ్లజతకు ప్రథమ స్థానం



ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్లజత

రాజుపాలెం, మార్చి10 (ఆంధ్రజ్యోతి): ఆకులగణపవరం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి 96వ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన ఆరుపళ్ల దూడల విభాగంలో మొత్తం 10ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఆరుపళ్ళ దూడల విభాగంలో నిర్ణీత 15 నిమిషాల కాల వ్యవధిలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం అత్తోట శిరీషా శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్లజత 4250 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. విజయవాడకు చెందిన వల్లభనేని మోహనరావు, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామలక్ష్మపురంకు చెందిన ఉత్తం పద్మావతి రెడ్డి కంబైన్స్ ఎడ్లజత 4000 అడుగుల దూరం లాగి రెండో స్థానంలో నిలిచాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

కల్తీకారం మాఫీయాపై విజిలెన్స్ దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పరిసరాల్లో ని కల్తీ కారం మాఫీయాపై విజిలెన్స్ దాడులు జరిగాయి. విజిలెన్స్ ఎస్పీ దువ్వారపు సూర్య శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున నుంచి ఈ దాడులు ఆరంభం అయ్యాయి.'పేరేచర్లలో కల్తీ కారం.. కర్మాగారం' అనే శీర్షికతో ఆదివారం ప్రచురితమైన కథనంపై స్పందించిన విజిలెన్స్ అధికారులు వెంటనే దాడులు ప్రారంభించారు. పేరేచర్ల కొండ ప్రాంతంలో మిరపకాయల తొడియాలు, తాలు కాయలుతో కారం తయారు చేసి రసాయనాలు, ఫుడ్ కలర్ కలిపి అమ్మకాలు జరుపుతున్న స్థావరాలపై ఈ దాడులు జరిగాయి. కేవలం రాత్రి వేళల్లో మాత్రమే జరిగే ఈ వ్యవహారంలో విజిలెన్స్ అధికారులు చాకచక్యంగా వ్యవహరించారు. కారంమిల్లు నుంచి గోడౌన్‌లకు తరలించే సమయంలో దాడులు నిర్వహించారు. తెల్లవారుజామున ఊహించని రీతిలో దాడులు ఆరంభం కావటంతో వ్యాపారులు టన్నుల కొద్దీ కల్తీ కారం వదిలి పెట్టేసి పారిపోయారు. కారం నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇదే తరహాలో మరికొన్ని చోట్ల కల్తీకారం తయారు చేస్తున్నారని తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు అక్కడ కూడా దాడులు చేశారు. సోమవారం అర్ధరాత్రి వరకు ఈ దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, శివాజీ, ఏవో ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీవ ఇంధనమే భవిష్యత్తు తరాలకు ప్రత్యామ్నాయం

పెదకాకాని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జియో ఇంధనమే భవిష్యత్తు తరాలకు ప్రత్యామ్నాయమని, గ్రీన్ ఎనర్జీపై అందరికీ అవగాహన ఉండాలని ఐఐఎమ్ నాగపూర్ కు చెందిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ గ్రీన్ ఎనర్జీ వ్యవస్థాపకులు వైభవ్ డాంగే పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలో భారత ఆర్థిక వ్యవస్థలో బయో ఫ్యూఎల్, గ్రీన్ ఎనర్జీ ప్రభావంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైభవ్ డాంగే మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థపై వీటి ప్రభావం ఎలా ఉంటుందో అనే అంశాలపై ఈ సమావేశంలో ఆయన చర్చించారు. కామర్స్, వ్యాపార నిర్వహణ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ ఈ సదస్సుకు సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌యూ ప్రవేశాల విభాగం సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మాజీ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణకు జీవ ఇంధనం ఎంతలా పడుతుందో వివరించి, వందన సమర్పణ చేశారు. గౌరవ అతిథులుగా ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి, ఆర్ట్స్ కామర్స్, లా కళాశాల ప్రచార్యులు ఆచార్య ఎమ్ సురేష్ కుమార్, సైన్స్ కళాశాల ప్రచార్యులు ఆచార్య కె వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కోడానికి సంసిద్ధంగా ఉండాలి

● భాష్యం స్ప్రింగ్ ఫెస్ట్‌లో వక్తలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కళ్యాణచక్రవర్తి, చిత్రంలో భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), మార్చి 10(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడా నికి ఎప్పుడు సంసిద్ధంగా ఉండాలని, అప్పుడే ఉన్నత విజయాలు సాధించగలమని ప్రముఖ వైద్యుడు జీ కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. సోమవారం భాష్యం ఐఐటీ ఫౌండేషన్ అకాడమీ ఆధ్వర్యంలో గోరంట్ల భాష్యం రామసేతు క్యాంపస్‌లో జరిగిన స్ప్రింగ్ ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు సాధించే క్రమంలో ఒత్తిడి సహజమని ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, ప్రణాళికాబద్ధంగా మీ దినచర్యను రూపొందించుకుంటే దీనిని అధిగమించవచ్చన్నారు. మరో అతిథి ప్రముఖ గైనకాలజిస్ట్, డాక్టర్ పద్మజ మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో విలువైందని, సెల్ ఫోన్స్, సోషల్ మీడియా వంటి వాటికి బానిసలు కాకుండా చదువుపై దృష్టిసారించాలన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి భాష్యం విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. అతిథుల చేతుల మీదుగా జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

తెనాలి శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ చెప్పారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందని సీఎం చంద్రబాబు మహిళా దినోత్సవం రోజున తెలిపారని గుర్తుచేశారు. మహిళా సంక్షేమం, సాధికారత, భద్రత కోసం వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారని, వాటిని కూటమి ప్రభుత్వం అమలు పరుస్తుందని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజా మాష్టారు మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో హక్కు, స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించారన్నారు. అదేస్ఫూర్తితో మహిళలను ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో భీమినేని వందనాదేవి, కంచర్ల శివరామ య్య, మద్దిరాల గంగాధర్, మేళం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేయాలి

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), మార్చి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంను ఏర్పాటుచేయాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట సోమవారం అంబేడ్కర్ అధ్యయన కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది, విద్యార్థులు చేపట్టిన నిరసనకు ఆయన మద్దతుగా మాట్లాడారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 48 శాతం మహిళలు, మొత్తం విద్యార్థుల్లో 90శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలు విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఈ అవశ్యకతను గుర్తించి రాష్ట్రంలో దీనిని ఏర్పాటు చేయాలని కోరారు. అధ్యయన కేంద్ర ఉద్యోగి పి.నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి సిబ్బందికి జీతాలు, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. నిరసనలో ఉద్యోగులు, ప్రజా సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో హోంగార్డు ప్రతిభ

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో హోంగార్డు కృష్ణకిశోర్ ప్రతిభ కనబరిచారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం కృష్ణకిశోర్‌ను అభినందించి, రూ.10వేల నగదు బహుమతి అందించారు. ఈనెల 4 నుండి 9వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఐదు కిలోమీటర్ల నడకపోటీలో రెండోస్థానంలో నిలిచారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కృష్ణకిషోర్‌ను అభినందించారు. అదేవిధంగా గత ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు అలకుంట చిన్నసుబ్బారావుకి జిల్లా హోంగార్డుల ఒకరోజు వేతనం రూ.2లక్షల 27వేల 910 చెక్కును ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి, వెల్ఫేర్, హోంగార్డ్ ఆర్ఐ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కిడ్నాప్ కేసు నిందితులు

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీపార్క్ వెనుక ఈనెల 6న రాత్రి సమయంలో సత్తెనపల్లికి చెందిన నరసింహారావుని కిడ్నాప్ చేసి ఆయన నుంచి దోపిడీకి పాల్పడిన నలుగురు నిందితులను కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సత్తెనపల్లి చెందిన నరసింహారావు తన బంధువులు ఆసుపత్రిలో ఉండగా గుంటూరు వచ్చాడు. తనకు ఆన్‌లైన్లో పరిచయమైన వ్యక్తి ఇచ్చిన సమాచారంతో గాంధీపార్కు వెనుకకు వెళ్ళాడు. అక్కడ నలుగురు వ్యక్తులు నరసింహారావును ఆటోలో ఎక్కించుకొని లింగాయపాలెం ప్లాట్లలోకి తీసుకెళ్లి కొట్టి రూ.15 వేల నగదు, బంగారు ఉంగరం, సెల్‌ఫోన్ గుంజుకొని పారిపోయారు. నరసింహారావు ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

హిందూ దేవుళ్ల ఉత్సవాలపై దాడులు హేయం

● హిందూ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

గుంటూరు(తూర్పు), మార్చి 10(ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్ల ఉత్సవాలపై వరుసగా జరుగుతున్న దాడులను అరికట్టాలని హిందూ చైతన్య వేదిక, వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేటి ఉత్సవంపైన ముస్లింలు చేసిన దాడికి నిరసనగా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జాతీయ నాయకుడు రాఘవులు మాట్లాడుతూ ఊరేగింపుపై ముస్లింలు కావాలనే దాడులకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఈ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే పోలీసులు హిందువులపైనే కేసులు నమోదుచేశారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్‌నారాయణ మాట్లాడుతూ దాడి చేసినవారిని వెంటనే అరెస్ట్‌చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో హిందూ చైతన్య వేదిక, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న హిందూ చైతన్యవేదిక, బీజేపీ సభ్యులు

అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 290 అర్జీలు
● పరిష్కరించాలంటూ ఆదేశాలు

గుంటూరు(తూర్పు), మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 290 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజా వలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం గంగరాజు, లక్ష్మీకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్‌జగన్నాథ్, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. నెల రోజుల తరువాత ప్రారంభమైన పీజీఆర్ఎస్‌కు పెద్ద సంఖ్యలో అర్జీదారులు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను గుణాత్మకంగా పరిశీలించి వారి సంతృప్తిస్థాయిని పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, డీర్డీఏ పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీలు శంకర్, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డీఎస్‌వో కోమలి పద్మ, డీపీవో నాగసాయి కుమార్, డీటీసీ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి పక్కన జేసీ భార్గవ్‌తేజ తదితరులు

● వడ్డీ వ్యాపారి వేధిస్తున్నాడు

అసలు, వడ్డీ చెల్లించిన తరువాత కూడా ఎక్కువ వడ్డీ ఇవ్వాలంటూ వడ్డీ వ్యాపారి వేధిస్తున్నాడని నెహ్రూనగర్ 5వ లైనుకు చెందిన గూడవల్లి నాగేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల క్రితం నెహ్రూనగర్ 2వ లైన్లో నివాసముండే షేక్ మీరావలీ వద్ద రూ.లక్షా 60వేలు అప్పుగా తీసుకున్నాని దానికి వడ్డీ కలిపి రూ.3లక్షలు ఇచ్చానని తెలిపారు. మరో రూ.2లక్షలు ఇస్తేనే ప్రామిసరీ నోట్లు, చెక్కులు ఇస్తానని సదరు వ్యాపారి బెదిరిస్తున్నాడని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసానని కోపంతో నాపై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి వ్యాపారి నుంచి ప్రాణరక్షణ కల్పించాలని కోరారు.

● వితంతు పెన్షన్ రావడం లేదు..

ఏడాది క్రితం నా భర్త అనారోగ్యంతో చనిపోయాడని, అనంతరం వితంతు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్నానని కానీ ఇంతవరకు పెన్షన్ రాలేదని స్థానిక వెంగళరావునగర్‌కు చెందిన పోలిచెర్ల ఖైరూన్ కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. నా పేరు మీద 1.5 ఎకరాల ఉందని ఆన్‌లైన్‌లో నమోదైనట్లు సచివాలయ సిబ్బంది చెబుతున్నారని నా పేరు మీద ఎటువంటి ఆస్తులు లేవని, ఉన్నతాధికారులు స్పందించి పెన్షన్ ఇప్పించాలని కోరారు.

17న స్టాండింగ్ కమిటీ సమావేశం

● నేటికి ప్రియంబుల్ సిద్ధం చేయాలి
● అధికారులను ఆదేశించిన కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీన స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, దీనికి సంబంధించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు, వివిధ పనులు నిర్వహించుటకు ప్రియంబుల్స్ ఈ నెల 11వ తేదీ లోపు కౌన్సిల్ సెక్రటరీకి అందజేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నగర పాలక సంస్థ విభాగాధిపతులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఛాంబర్ నందు స్టాం డింగ్ కమిటీ సమావేశ నిర్వహణపై విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొంతకాలంగా స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించకపోవడంతో నగరంలో పలు అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని, నూతనంగా ఏర్పడిన స్టాండింగ్ కమిటీ సభ్యులతో ఈ నెల 17న సమావేశం నిర్వహించుటకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, ఎంహెచ్‌వో ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో ప్రసంగిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

● క్లోరిన్ శాంపిల్స్ సేకరించాలి

గుంటూరు నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా తాగునీటి సరఫరా జరిగే సమయంలో ప్రతి ఎమినిటి కార్యదర్శి క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలని, శాంపిల్స్ రిపోర్ట్ కమిషనర్ చాంబర్‌కి అందించాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ నాజ్ సెంటర్‌లోని రిజర్వాయర్‌లో తాగునీటి శాంపిల్ పరిశీలించి, క్లోరిన్ శాతాన్ని తనిఖీ చేశారు. ఎక్కడైనా కలుషిత నీటి సరఫరా జరుగుతున్నట్లు గుర్తిస్తే సమస్య పరిష్కారానికి ఇంజనీరింగ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

● దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగర పాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజల అర్జీలను అధికారులు సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు స్పష్టంచేశారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన 18 ఫిర్యాదులు తీసుకున్నారు. అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కౌన్సిల్ హాల్లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 44 ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీసీపీ సూరజ్, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, ఉపా సెల్ పీవో రామారావు, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● ఇక ప్రతి శుక్రవారం డయల్ యువర్ సౌత్ డీఎస్పీ



డయల్ యువర్ డీఎస్పీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తోన్న సౌత్ డీఎస్పీ భానోదయ

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని నల్లపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను పోలీస్ స్టేషన్ల పరిధిలోని బాధితులకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే కాకుండా పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం డయల్ యువర్ డీఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సౌత్ డీఎస్పీ జి భానోదయ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె డయల్ యువర్ డీఎస్పీకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు సంబంధిత సమస్యలు ఉన్న బాధితులు ప్రతి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల మధ్య నేరుగా తనకు 86888 31375 నెంబర్ లో తెలియచేయవచ్చని తెలిపారు. సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న నల్లపాడు, ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని సౌత్ డీఎస్పీ భానోదయ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా ప్రమాదాలను అరికట్టేందుకు గాను నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలకు సంబంధించిన బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామన్నారు. తన సబ్ డివిజన్ పరిధిలో జీరో రోడ్డు ప్రమాదాలు లక్ష్యంగా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. సౌత్ సబ్ డివిజన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా బహిరంగ మద్యపానం... డ్రంక్ అండ్ డ్రైవ్... ట్రిపుల్ రైడింగ్ పై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు భానోదయ వెల్లడించారు. ఇకనుంచి పోలీస్ స్టేషన్లలో అవినీతి జరిగినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.



శ్రీరామనవమి శోభాయాత్ర ఆహ్వానపత్రికను కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసానికి అందజేస్తున్న కమిటీ సభ్యులు

శోభాయాత్రలో పాల్గొనాలని కేంద్ర మంత్రి పెమ్మసానికి ఆహ్వానం

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి రోజున నిర్వహించే శోభాయాత్ర భారీ బైకుర్యాలీలో పాలుపంచుకోవాలని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మంత్రి పెమ్మసానిని కలిసిన సభ్యులు ఏటా శ్రీరామనవమి పర్వదినాన బృందావన్‌గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి నగరవీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పారిశ్రామికవేత్తలు గ్రంధి కాంతారావు, వేద సీడ్స్ అధినేత తులసీ ధర్మ చరణ్, గుదిబండి వెంకటసాంబిరెడ్డి, చుక్కపల్లి రాకేష్‌ని కలిసి ఆహ్వానపత్రికలు అందజేశారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 10(ఆంధ్రజ్యోతి): చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ నా గలక్ష్మి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పా టుచేసిన చేనేతవస్త్రాల అమ్మకాల మొబైల్ వ్యాన్ కౌంటర్‌ను జేసీ భార్గవ్‌తేజ, అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలసి ఆమె పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళా నేతకార్మికులకు సీఎం చంద్రబాబు ఈ వ్యాన్‌లను పంపిణీ చేశారన్నారు. ఉత్పత్తిదారునికి తక్షణ నగదు, ప్రజలకు నాణ్యమైన చేనేత ఉత్పత్తులను చౌకధరలకు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నా రు. స్వయం సహాయక సంఘాల మహిళా నేత కార్మికుల సమగ్రాభివృద్ధికి, ఏడాదిపాటు నిరంతర ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తుందని ఆమె తెలిపారు.

ఎమ్మెల్సీ ఆలపాటికి అభినందన

గుంటూరు(విద్య), మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీని అభినదించిన వారిలో రిటైర్డ్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జెల్ది విజయ్‌పాల్, ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పార్థసారధి, సంఘ నాయకులు భానుమూర్తి, వీరాస్వామి, వసంతరావు తదితరులు ఉన్నారు.



మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయసునీతకు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘాల నాయకులు

అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు రైతు సంఘాల విజ్ఞప్తి

గుంటూరు సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతులు పండిస్తున్న అన్ని పంటల కు మద్దతు ధర ప్రకటించాలని రైతు సంఘాల రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఆ యా సంఘాల నాయకులు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయసునీతను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దతుధర కల్పించి, రై తులను ఆదుకునేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యే క నిధికి ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి కిడ్నాప్.. హత్యాయత్నం

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని ఆమె బంధువులు కిడ్నాప్ చేసి హత్యయత్నానికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముప్పాళ్ళ మండల పరిధిలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన వివాహితతో అదే గ్రామానికి చెందిన నీలం రామలింగేశ్వరరావు వివాహేతర సంబంధం ఉంది. రామలింగేశ్వరరావు సోమవారం ఆమెను గుంటూరు జిన్నాటవర్ సెంటర్ సమీపంలోని బాలాజీ లాడ్జికి తీసుకొని రాగా వారిని అనుసరిస్తూ వచ్చిన ఆమె బంధువులు లాడ్జిలో రామలింగేశ్వరరావుకు దేహశుద్ధి చేసి కిడ్నాప్ చేసి తమ వెంట తీసుకువెళ్లారు. హోటల్ నిర్వాహకుడు ఇచ్చిన సమాచారంతో లాలాపేట సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది రంగంలోకి దిగి సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా నలుగురు వ్యక్తులను నరసరావుపేట సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామలింగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్, హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని వైసీపీ నాయకురాలి మోసం

హైకోర్టులో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి వైసీపీ నాయకురాలు అనుశెట్టి దివ్య తన నుంచి మూడున్నర లక్షల తీసుకొని మోసం చేసిందని అమరావతి మండలం జూపూడి గ్రామానికి చెందిన బాబు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. బెల్లంకొండ పరిధిలోని మాచాయపాలెం గ్రామానికి చెందిన దివ్య కృష్ణా జిల్లాలో ఉంటుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆమె తనకు వైసీపీ ముఖ్య నాయకులతో సంబంధాలు ఉన్నాయని, హైకోర్టులో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని తన నుంచి మూడున్నర లక్షల తీసుకొని మోసం చేసిందన్నారు. బాధితుడు పల్నాడు జిల్లాకు చెందిన వాడు కావడంతో అక్కడకు వెళ్లాల్సిందిగా సిబ్బంది సూచించారు.

చిట్స్ నిర్వాహకురాల మృతి

● నమ్మకంగా మోసం చేసిన తనయుడు

చిట్స్ నిర్వాహకురాలు మృతిచెందగా ఆమె కుమారుడు చిట్స్ కొనసాగించి ఆ తర్వాత డబ్బు లు ఇవ్వకుండా అదృశ్యమయ్యాడని కిడాంబి నగర్‌కు చెందిన బాధితులు పెద్దసంఖ్యలో సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. కిరాంబినగర్ 5వ లైన్‌కి చెందిన తిరుమలశెట్టి చంద్ర అనే మహిళ చీటీలు నిర్వహిస్తూ గత డిసెంబర్ 31న గుండెపోటుతో మృతి చెందిం దన్నారు. తల్లి మరణం తరువాత రెండు నెలల పాటు కుమారుడు ప్రభుకుమార్ ఆయా చీటీలను కొనసాగించాడన్నారు. ఈవిధంగా చీటీలు నిర్వహించి ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. సుమారు 20మంది బాధితులకు రూ.40లక్షల వరకు రావాల్సివుందని బాధితులు బాణాల లక్ష్మి, మహమ్మద్ నూర్జహాన్, జొన్నాదుల వెంకట నాగలక్ష్మి, అనేకమంది బాధిత మహిళలు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు.

డ్రైవర్ ఉద్యోగం ఇప్పిస్తానని మహిళా హోంగార్డు మోసం

తనకు హోంగార్డ్ కోటాలో డ్రైవర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 2 లక్షల70 వేలు తీసుకొని మహిళా హోంగార్డు గుంజి సత్య మోసం చేసిందని చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన చదలవాడ అను వీర శంకర్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తనకు హోంగార్డు డ్రైవర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మహిళా హోంగార్డు సత్య మోసం చేసిందన్నారు. తనకు న్యాయం చేయాలని బాధితుడు శంకర్ పోలీస్ అధికారులను వేడుకున్నాడు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఆక్రమణలు తొలగించాలి

● ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ శ్రీనివాసులు



ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై సంయుక్తంగా పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రోడ్ల విస్తరణ, అనధికార ఆక్రమణల తొలగింపు తప్పనిసరని, నగర ప్రజలు సహకరించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే మాధవి, జీఎంసీ కమిషనర్ ఇతర అధికారులతో కలిసి టీజేపీఎస్ కాలేజి సెంటర్, కంకరగుంట ఆర్‌యూబీ, బ్రాడీపేట 1వ లైన్ ప్రాంతాల్లో పర్యటించి, ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనులు ప్రారంభానికి ముందే ట్రాఫిక్‌కి ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు రోడ్ల విస్తరణ తప్పనిసరని, విస్తరణలో ప్రభావిత భవన యజమానులు, ఆక్రమణదారులు ప్రజా సౌకర్యం కోసం సహకరించాలని కోరారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, ఈఈ కోటేశ్వరరావు తదితర జీఎంసీ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీసీ భవన్‌ను వెంటనే పూర్తి చేయాలి

● శాసనసభలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గత ప్రభు త్వ కక్ష పూరిత చర్యల వల్ల నిర్లక్ష్యానికి గురయిన బీసీ భవన్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సోమవారం బీసీ సంక్షేమంపై జరిగిన చర్చలో మాధవి ప్రసంగించారు. గత పాలకుల కక్ష పూరిత, అసమర్థ విధానాల వలన బీసీల సంక్షేమం మరుగున పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్లో విద్య, వైద్యంతోపాటు 47,456 కోట్లు బీసీలకు కేటాయించటం ఆనందదాయకమన్నారు. సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కేంద్రమైన గుంటూరులో బీసీ స్టడీ సర్కిల్ కూడా ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.

మైనార్టీల సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

● శాసనసభలో ఎమ్మెల్యే నసీర్ విజ్ఞప్తి

గత ప్రభుత్వం రద్దు చేసిన మైనార్టీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కోరారు. శాసనసభలో సోమవారం ఆయన సీఎం చంద్రబాబుకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో ముస్లింలకు రూ.5,423 కోట్ల కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గత వైసీపీ ప్రభుత్వం ముస్లింలకు చేసిన అన్యాయాన్ని సభ వేదికగా నిగ్గు తేల్చారు. మైనార్టీలకు రంజాన్‌తోఫా పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఇమామ్, మౌజన్లకు తోడుగా నిలిచిన చంద్రబాబు రూ.90 కోట్లు బడ్జెట్లో కేటాయించారని వెల్లడించారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో హజ్ హౌస్ ఏర్పాటుకు సీఎం చర్యలు తీసుకున్నారని, వైసీపీ ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదని చెప్పారు. హజ్‌హౌస్ ఏర్పాటు చేయాలని కోరారు.

కోకో గింజలకు మద్దతు ధర కల్పించండి

రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

గుంటూరు(తూర్పు), మార్చి 10(ఆంధ్రజ్యోతి): కిలో కోకో గింజలకు రూ.900 ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరు, రాష్ట్ర ఉద్యానశాఖ కార్యాలయం ఎదుట రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలు సిండికేట్‌గా మారి ధరను తగ్గిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. అనంతరం ఉద్యానశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ హరినాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు కంచుమాటి అజయ్‌కుమార్, కోకో రైతులు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సంచరిస్తున్న 12 శునకాలకు ఏఆర్ వ్యాక్సిన్

గుంటూరు మెడికల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో సంచరిస్తున్న కుక్కలను పట్టుకొని పశు సంవర్ధక శాఖ అధికారులు సోమవారం యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేశారు. ఇటీవల ప్రభుత్వాస్పత్రిలో శునకాల సంచారం బాగా పెరిగింది. వీటిని పట్టుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి లేఖ రాశారు. కమిషనర్ సూచనల మేరకు సోమవారం పశు సంవర్ధక శాఖ సిబ్బంది జీజీహెచ్‌కు వచ్చి 12 కుక్కలను పట్టుకుని కొత్తపేటలోని పశువైద్యశాలలో యాంటీర్యాబీస్ వ్యాక్సిన్ వేసి విడిచిపెట్టారు.

కూటమి ప్రభుత్వ హామీని అమలుచేయాలి

గుంటూరు(తూర్పు), మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేద ప్రజలకు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు వెంటనే విడుదల చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక కేవీపీకాలనీ, మున్సిపల్ హైస్కూల్ వద్ద సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరుతూ అర్జీల కార్యక్రమం జరిగింది. శివారు ప్రాంతమైన కేవీపీకాలనీ, వికలాంగుల కాలనీ పరిసర ప్రాంతాల్లో ఇల్లు లేని నిరుపేద ప్రజలు అధిక సంఖ్యలో నివసిస్తున్నారని, వారికి రెండు సెంట్లు కేటాయించాలని కోరారు. అనంతరం అర్జీలను స్థానిక సచివాలయంలోని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో రావుల అంజిబాబు, చిన్నపోతుల విజయకుమార్, జి లక్ష్మి, మిరియాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం: వేములకొండ శ్రీనివాస్

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికతో టీడీపీ బీసీల పార్టీగా మరోసారి రుజువైందని టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. బీసీలపై దాడులు, హత్యలు, అక్రమ కేసులు, వేధింపులే అజెండాగా గత వైసీపీ పాలన సాగిందన్నారు. జగన్‌రెడ్డి తన సామాజికవర్గానికి చెందినవారితో అన్ని నామినేటెడ్ పదవులను భర్తీ చేసుకున్నాడని విమర్శించారు.

అంగన్వాడీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల అభ్యున్నతే లక్ష్యంగా గ్రాట్యుటీ అమలుచేసి, వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో అంగన్వాడీలు 43 రోజులు చేసిన దీక్షలను అణచడానికి ఎస్మా ప్రయోగించి ఇబ్బందిపెట్టిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. తన ఐదేళ్లలో పాలనలో ఒక్క రూపాయి కూడా అంగన్వాడీలకు జీతం పెంచకుండా మోసం చేశాడని విమర్శించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అంగన్వాడీ, డ్వాక్రా అధ్యక్షురాలు షేక్ జానీబేగం, అంగన్వాడీ రాష్ట్ర ప్రధానకార్యదర్శులు గంగినేని లీలావతి, వేంపాటి విజయలక్ష్మి, లామ్ నవమి తదితరులు పాల్గొన్నారు.

నిమ్నకులాల చైతన్యదీపిక సావిత్రీబాయి పూలే

గుంటూరు(తూర్పు), మార్చి 10(ఆంధ్రజ్యోతి): అట్టడుగు కులాలకు విద్యనందించిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. అరండల్‌పేట అమరావతి బుక్‌హాల్‌లో నిర్వహించిన సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, న్యాయవాది వైకే, విల్సన్, జయసుధ, పి.వి.రమణయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆకలి కేకలు

- ఎస్సీ కళాశాల హాస్టల్స్‌లో నాణ్యతలేని భోజనం
- రైస్ కుక్కర్లతో విద్యార్థులే వండుకుంటున్న వైనం
- కొందరికి అన్న క్యాంటీనే ఆధారం
- బోగస్ హాజరుతో అక్రమాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

గుంటూరు నగరం నడిబొడ్డున ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లి రెండు రోజులు నిర్బంధించినా పట్టించు కోరు... జిల్లా అత్యున్నత అధికారులు నివాసం ఉండే బంగ్లాల సమీపంలోని హాస్టల్లో ఓ విద్యార్థిని గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చినా... అధికారులు కళ్లు తెరవరు... మరోవైపు హాస్టల్స్ లో నాణ్యతలేని భోజనం తినలేక విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నా స్పందించరు.. ఇదీ నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్‌లో నెలకొన్న దయనీయ పరిస్థితులు.

గుంటూరు (విద్య) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ రోడ్డులోని (రమేష్ ఆస్పత్రి పక్కన), హయ్యర్ హాల్ కాంపౌండ్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండు కళాశాల హాస్టల్స్ నిర్వహిస్తున్నారు. మొదటి హాస్టల్‌లో 200 మంది, రెండో హాస్టల్లో 198 మంది ఎస్సీ విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు నగరంలోని కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ హాస్టల్స్‌లో కొంత కాలంగా భోజనం సక్రమంగా అందడం లేదు. దొడ్డు బియ్యంతో తయారు చేసిన చిమిడి పోయిన అన్నం, నాణ్యతలేని కూరలు వడ్డిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా నిత్యం ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో కొంతమంది విద్యార్థులు హాస్టల్ భోజనం తినలేక రైస్ కుక్కర్లను హాస్టల్స్‌కు తీసుకువచ్చి భోజనం వండుకుని కర్రీ పాయింట్స్ నుంచి కూరలు తెచ్చుకుని తింటూ కాలం వెళ్లదీస్తున్నారు. నగరం నడిబొడ్డున సాక్షాత్తూ జిల్లా అత్యున్నత అధికారుల కార్యాలయం రోడ్డులోనే ఈ తంతు జరుగుతున్నా, సంబంధిత అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు.

బోగస్ హాజరుతో నిధుల స్వాహా

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రెండు హాస్టల్స్‌లో ఉన్న ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 1600 వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇలా నెలకు రూ. 7 లక్షలపైగా మెనూ చార్జీల కింద, ఇతర నిర్వహణ చార్జీల కింద మరో రూ. 1.50 లక్షల చెల్లిస్తున్నారు. వాస్తవంగా ఉన్న విద్యార్థుల హాజరు కంటే ఎక్కువ చూపి బోగస్ హాజరు నమోదు చేసి నెలకు లక్షల్లో బిల్లులు పెడుతున్నారు. వచ్చిన సొమ్ములో ఉన్నతాధికారికి వాటాలు పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇటీవల ఏఎస్‌డబ్ల్యూవో బహిర్గతమైంది. సదరు అధికారి పరిశీలనకు వెళ్లిన సమయంలో రైస్ కుక్కర్లో విద్యార్థులు అన్నం వండుకుంటూ కనిపించారు. మరోవైపు కొంతమంది విద్యార్థులు సమీపంలోని హిందూ కళాశాల వద్ద ఉన్న అన్న క్యాంటీన్లో భోజనం, అల్పాహారం చేస్తున్నట్లు గుర్తించి ఆ అధికారి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా సమగ్ర నివేదిక అందజేసినా చర్యలు మాత్రం శూన్యం. కళాశాల హాస్టల్ వార్డెన్లు భారీ మొత్తంలో పైస్థాయిలో ఓ అధికారికి ముడుపులు చెల్లిస్తున్నారనీ, అందుకే వారిపై ఈగ వాలనీయడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఆరోపణలు ఉన్న వెల్ఫేర్ ఆఫీసర్‌కు కీలక పోస్టు...

హయ్యర్‌హాల్ హాస్టల్‌లో పనిచేసే ఓ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌పై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. గుంటూరుతో పాటు, బాపట్ల, పల్నాడు ప్రాంతాల్లో పనిచేసిన ఆయన ప్రతిచోట అక్రమాలకు, విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇప్పటికే నాలుగు సార్లు సస్పెండ్ అయినా తీరుమార లేదని ఆశాఖలో సిబ్బందే చెబుతున్నారు. గతంలో జడ్పీలో పనిచేసిన ఓ కీలకమైన అధికారి బంధువైన మహిళను వేధించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఇన్ని ఆరోపణలు ఉన్నా, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు కీలక మైన హాస్టల్‌లో పోస్టింగ్ ఇచ్చారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



ఓ గదిలో సామాన్లతోపాటు ఉన్న రైస్ కుక్కర్



■ ఉన్నతాధికారి రూటే సపరేటు

సాంఘిక సంక్షేమ శాఖలో ఓ అత్యున్నత అధికారి రూటే సపరేటు అన్నచందంగా సాగుతోంది. ఆయన జిల్లాకు వచ్చి ఐదు సంవత్సరాలు దాటింది. ఆయనపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకంలో అక్రమాలు, ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల్లో భారీ వసూళ్లు, కీలకమైన పోస్టింగ్ విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్‌లో ఇటీవల చోటు చేసుకున్న వరుస సంఘటనలపై కూడా చర్యలు లేవని చెబుతున్నారు.

అస్తవ్యస్తంగా హాస్టల్స్

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వలన సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్ అస్తవ్యస్తంగా మారాయి.

- ఏడాది క్రితం జూట్‌మిల్లు సమీపంలోనే విద్యార్థినుల కళాశాల హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని వైసీపీ కార్యకర్తలు కిడ్నాప్ చేసి రెండు రోజులు నిర్బంధించారు. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో ఇప్పటి వరకు తెలియదు.
- ఆర్నెల్లు క్రితం సాక్షాత్తూ కలెక్టర్, ఎస్పీ, ఐజీ బంగ్లాల రోడ్డులో ఉండే ఓ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చినా ఆ విషయం ఎనిమిది నెలల వరకు అధికారులకు తెలియలేదంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అవగతం చేసుకోవచ్చు.
- కలెక్టర్ బంగ్లా రోడ్డులోనే రెండు హాస్టల్స్‌లో నిత్యం విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చివరకు విద్యార్థి సంఘాల ఫిర్యాదుతో ఓ అధికారి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినా చర్యలు లేవు. దీనికితోడు నివేదిక ఇచ్చిన అధికారిపైనే సదరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఎదురుదాడికి దిగి ఆరోపణలు చేస్తున్నారు. దీనికి సాంఘిక సంక్షేమ శాఖలోని ఓ ఉన్నతాధికారి వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



ఇంటి నుంచి తెచ్చుకున్న రైస్ కుక్కర్ చూపుతున్న విద్యార్థి

చిన్న శేష వాహనంపై ఊరేగిన శ్రీవారు



శేష వాహనంపై దర్శనమిచ్చిన నృసింహస్వామి

మంగళగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి సోమవారం ఉదయం చిన్న శేష వాహనంపై పురవీధుల్లో విహ రించారు. ఈ ఉత్సవానికి మంగళగిరి పట్టణానికి చెందిన దేవతి భగవన్నారాయణ, పద్మజ దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. స్వామివారు సోమవారం రాత్రి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం మాడవీధుల్లో విహరించిన అనంతరం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు గ్రామోత్సవం సాగింది. ఈ ఉత్సవానికి మాల్యవంతం వెంకట కృష్ణమాచార్యులు జ్ఞాపకార్థం ఆయన మనుమలు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటి రెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్ల భక్త బృందం కమిటీ ట్రస్టు ఆధ్వర్యంలో మిద్దె సెంటర్లోని శ్రీప్రపత్తి ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

దుగ్గిరాల యార్డుకు కొత్త పసుపు కళ

- క్వింటాల్‌కు రూ.11,111 పలికిన ధర



దుగ్గిరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డు సోమవారం కొత్తపసుపుతో కళకళలాడింది. మహిళా హమాలీలు కాటాలకు పసుపు, కుంకుమలు పెట్టి పూజ చేసిన అనంతరం వేలం ప్రారంభించారు. డీడీ ఎస్ శ్రీనివాసరావు, పలువురు వ్యాపారులు పూజ కార్యక్రమానంతరం వేలంలో పాల్గొన్నారు. ఏటా మార్చి నెలాఖరులో వచ్చే కొత్తపంట ఈఏడాది 10వ తేదీనే రావడంతో రైతుల్లో ధరపై ఆశలు రేకెత్తుతున్నాయి. వారం రోజు లుగా క్వింటాల్ పసుపు రూ.10వేల లోపు ధర పలుకుతుండగా సోమవారం వచ్చిన కొత్తపసుపు క్వింటాల్‌కు రూ.11,111 ధర పలకడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేలంలో 288 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ము లు, కాయ ఒకేధరలు పలికాయి. క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.8,000, గరిష్ఠధర రూ.11,111, మోడల్‌ధర రూ.10,601 పలికాయి.



యార్డులో పూజలు జరుపుతున్న మహిళా హమాలీలు

మహిళా సాధికారతకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల సాధికారత కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం జీటీ రోడ్డులోని ఐటీఏ కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం -2025 నిర్వహించింది. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకోవాలని, అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను కూడా అందజేస్తున్నాయన్నారు. బ్యాంకు రీజనల్ హెడ్ ఎస్ జవహర్ మహిళల బహుముఖ పాత్రలను వివరిస్తూ ప్రశంసించారు. అలాగే డాక్టర్ జయలక్ష్మీదేవి బ్యాంకు మహిళా ఉద్యోగులకు, మహిళా పారిశ్రామికవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళల స్వయం సమృద్ధి కోసం బ్యాంకులు మరింత సహాయ సహకారాలను పెంచాలని కోరారు. బ్యాంకు ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలకు రూ. 150కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కస్టమర్లు, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

బీఈడీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో పది మంది అరెస్టు

- వినుకొండ వివేకానంద కళాశాల కరస్పాండెంట్‌దే కీలకపాత్ర
- ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడి

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న బీఈడీ పరీక్షలకు సంబంధించి ఈ నెల ఏడున ప్రశ్నపత్రం లీకేజీ ఘటనకు వినుకొండ వివేకానంద కళాశాల కరస్పాండెంట్, చైర్మన్ అయిన సయ్యద్ రఫిక్ అహ్మద్ కీలక సూత్రధారిగా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఈ కేసులో కరస్పాండెంట్ రఫిక్ అహ్మద్‌తో పాటు కళాశాల ప్రిన్సిపల్ ధూపాటి సురేష్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ ధారా స్వర్ణ రాజ్ మరో ఏడుగురు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఏజెంట్లు, విద్యార్థులను అరెస్టు చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం మొత్తం మీద ఆరువేల బీఈడీ సీట్లు ఉండగా ఒక నాగార్జున యూనివర్సిటీ పరిధిలోనే ఆరువేల వరకు బీఈడీ సీట్లు ఉన్నాయన్నారు. అంతేకాకుండా ఇక్కడ బీఈడీకి ఆదరణ తగ్గడంతో పాటు ఒడిశాలో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలలో ప్రవేశం కోసం ఎగబడుతున్నారు. దీంతో ఒడిశాకు చెందిన కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఏజెంట్లుగా మారి ఇక్కడ ఒడిశా విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తున్నారు. ఆయా విద్యార్థుల వద్ద లక్ష నుంచి లక్షన్నర వరకు ఏజెంట్లు వసూలు చేస్తున్నారు. ఇక్కడ కళాశాల యాజమాన్యాలకు రూ. 70 వేల వరకు చెల్లిస్తున్నారు. ఆయా విద్యార్థులకు అక్కడే తరగతులు నిర్వహిస్తూ ఇక్కడ మాత్రం పరీక్షలు రాయిస్తున్నారు. ఈ క్రమంలో సయ్యద్ రఫిక్ అహ్మద్ వినుకొండలో శ్రీ వివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, నవ్య చైతన్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, అమరావతిలో ఆజాద్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తుండగా ఆయన కూతురు పేరుతో వినుకొండలో ఆలీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తున్నారు. రఫిక్ అహ్మద్ నిర్వహిస్తున్న బీఈడీ కళాశాలలో ఎక్కువ మంది ఒరిశా విద్యార్థులు ప్రవేశం పొందారు. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్స రంలోనూ ఒడిశా నుంచి ఎక్కువమంది విద్యార్థులు తమ కళాశాలలో అడ్మిషన్ పొందేందుకు గాను ఆయా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడం, అదేవిధంగా ఆయా ఏజెంట్లను సంతృప్తి పరచడం కోసం బీడీ ప్రశ్నపత్రాలను లీకేజ్ చేసేందుకు రఫిక్ అహ్మద్ పథకం రూపొందించాడని ఎస్పీ తెలిపారు. అదే



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐ నారాయణస్వామి, వెనుక నిందితులు

సమయంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయం కూడా రఫిక్ అహ్మద్‌కు కలిసి వచ్చింది. సాధారణంగా రెండు, మూడు రకాల ప్రశ్నపత్రాలను తయారుచేసి వాటికి ప్రత్యేకంగా కోడ్ ఇచ్చి సీల్ వేసి సంబంధిత పరీక్షా కేంద్రాలకు పంపుతారు. ఐదు నిమిషాల ముందు ఏ కోడ్ పేపర్ విద్యార్థులకు ఇవ్వాలనేది యూనివర్సిటీ ఉన్నతాధికారులు సమాచారం ఇస్తారు. దీంతో ప్రశ్నపత్రాల లీకేజీకి దాదాపు అవకాశం ఉండదు. అయితే ఈ దఫా ప్రశ్నపత్రాలను పీడీఎఫ్ రూపంలో సీడీలలో ముందుగానే కళాశాలలకు పంపారు. పరీక్షకు 40 నిమిషాల ముందుగా ఆయా సీడీలకు పాస్‌వర్డ్ తెలియజేశారు. దీంతో ఆయా కళాశాల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ తమకు వచ్చిన సీడీలోని పీడీఎఫ్‌ను పాస్‌వర్డ్ ఉపయోగించి ఓపెన్ చేసుకొని వాటిని ప్రింట్ తీసి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఇవ్వాలని నిర్ణయించారు. కేవలం ప్రశ్న పత్రాల ప్రింటింగ్ ఖర్చు తగ్గుతుందనే దురుద్దేశంతో చేసిన ఈ అనాలోచిత నిర్ణయంతో 40 నిమిషాలకు ముందుగానే ప్రశ్నపత్రం తాలూకా నకళ్లు జిరాక్స్ సెంటర్లలో దర్శనమిచ్చాయి. ఈ క్రమంలో ఈ నెల 7న జరగాల్సిన పర్స్పెక్టివ్స్ ఇన్ చైల్డ్ డెవలప్మెంట్ పరీక్షకు సంబంధించిన సీడీని వినుకొండలోని వివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ రఫిక్ అహ్మద్ తన కళాశాల కంప్యూటర్ ఆపరేటర్ అయిన ధార స్వర్ణరాజ్‌కు ఇచ్చారు. ప్రిన్సిపల్ ధూపాటి సురేష్ కుమార్, స్వర్ణరాజ్ ఇరువురు కలిసి రెండు గంటలకు జరగాల్సిన పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాన్ని ఒంటిగంటా 21 నిమిషాలకు ఒడిశాకు చెందిన ఏజెంట్ల సెల్‌ఫోన్ వాట్సాప్‌కు పంపారు. ఆయా ఏజెంట్లు తమ విద్యార్థులకు పంపగా వారు ఏకంగా గ్రూపులోనే ప్రశ్నపత్రాన్ని ఫార్వర్డ్ చేశారు. దీంతో పరీక్షకు 40 నిమిషా లకు ముందుగానే బీఈడీ ప్రశ్నాపత్రం వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేసింది. ఈ విషయం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి వెళ్లడంతో ఆయన ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై విచారణకు ఆదేశించారు. దీనిపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోఆర్డినేటర్ మన్నవ సుబ్బారావు ఫిర్యాదు మేరకు పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేశారు. వివేకానంద బీఈడీ కళాశాల కరస్పాండెంట్ రఫీక్ అహ్మద్, ప్రిన్సిపల్ సురేష్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ స్వర్ణ రాజ్‌లు ప్రశ్నపత్రాన్ని ఒడిశాకు చెందిన ఏజెంట్లకు పంపారు. ఒడిశాకు చెందిన ఏజెంట్ ధీరేన్ కుమార్ సాహూ దానిని ఒడిశాకు చెందిన విద్యార్థులు ప్రియ భత్రో గౌడయ్, మిలాన్ తృప్తి లకు పంపాడు. దీంతో పోలీసులు ధీరేన్ కుమార్ సెల్‌ఫోన్ వాట్సాప్ ఐడి నుంచి దర్యాప్తు చేయగా ఇందులో వినుకొండ లోని శ్రీ వివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు కీలకపాత్ర పోషించినట్లు తేలింది. కాగా ఈ ఘటనపై జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నార్త్ డీఎస్పీ సిహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరిపి ఇందుకు బాధ్యులైన వివేకానంద బీఈడీ కళాశాల కరస్పాండెంట్ సయ్యద్ రఫిక్ అహ్మద్ తో పాటు నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామానికి చెందిన కళాశాల ప్రిన్సిపల్ ధూపాటి సురేష్ కుమార్, వినుకొండకు చెందిన కళాశాలలోని కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా స్వర్ణరాజ్, ఏజెంట్లు అయిన ఒడిశా రాష్ట్రంలోని అంగుల్ పట్టణానికి చెందిన సంతోష్ కుమార్ సాహూ, బరంపురం మండలం లంజీపల్లికి చెందిన బిష్ణు ప్రసాద్ పత్రో, నిస్సిమ్ కోయిల్ మండలం పాయకాపూర్ గ్రామానికి చెందిన సుఖాంత్ బెహరా, కోరంపూర్ జిల్లా బైపరిగూడకు చెందిన పురుషోత్తం ప్రధాన్, నయాపల్లికార్డకు చెందిన ధీరేన్ కుమార్ సాహూ, అదేవిధంగా బీఈడీ విద్యార్థులైన ఒడిశా రాష్ట్రంలోని భైరవ చొక్కా గ్రామానికి చెందిన ప్రియాబత్రో గోడయ్, రాయగడ జిల్లా కటికల్ గ్రామానికి చెందిన మిలాన్ తృప్తి అనే పదిమందిని అరెస్టు చేశారు. వారి నుంచి 13 సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గంలో పర్యావరణ, కాలుష్య రహిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే ప్రవీణ్ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనపై మాట్లాడారు. పెదకూరపాడు మండలంలోని గారపాడులోని 300 ఎకరాల ఉమ్మడి భూమిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడి రైతులు మిరప, పత్తి, వరిని ఎక్కువగా సాగు చేస్తుంటారని, ఈ ప్రాంతం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అనువుగా ఉంటుందన్నారు. వ్యవసాయం పై ఆధారపడి జీవించే యువకులకు ఉద్యోగ, ఉపాధి లభించే అవకాశం ఉంటుందని ప్రవీణ్ అన్నారు.

పరిశ్రమల శాఖ మంత్రికి వినతి..

నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ కల్పనలో భాగంగా నియోజక వర్గంలో ఇండస్ట్రియల్‌పార్కు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ప్రవీణ్ సోమవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలసి వినతి పత్రం అందించారు.



మంత్రి భరత్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

డీ-పట్టాలతోనే సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు ఆటంకం

- స్థలాల ధరలు పడిపోతాయంటున్న యజమానులు
- నామమాత్రంగా ఫీజు నిర్ణయించి రిజిస్ట్రేషన్ చేస్తేనే మేలని వాదన



గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మరో అవకాశం విజయవంతం కావాలంటే కొన్ని సవరణలు తప్పనిసరన్న అభిప్రాయం వివిధ వర్గాల ద్వారా వ్యక్తమౌతున్నది. ముఖ్యంగా 150 చదరపు గజాల లోపు భూములకు డీ-పట్టా మంజూరు చేస్తామని ప్రభుత్వం నిబంధన పెట్టింది. దీని వలన పదేళ్ల వరకు ఆ స్థలాన్ని విక్రయించుకొనే అవకాశం ఉండదు. ఈ కారణంగా చాలామంది భూయజమానులు సీలింగ్ పరిధిలో ఉన్న తమ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ కేవలం గడువు మాత్రమే పొడిగించడం వలన ఎలాంటి ఉపయోగం లేదన్న అభిప్రాయం వినవస్తోన్నది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని అసెంబ్లీ ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లో చర్చకు లేవనెత్తితే కొంత మేలు జరిగే అవకాశం ఉన్నది.

పట్టణ భూపరిమితుల చట్టం 1976 ప్రకారం ప్రభుత్వ పరిధిలోకి వచ్చినటువంటి సీలింగ్, మిగులు భూముల్లో ఉన్న ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఈ ఏడాది ఆఖరు వరకు ప్రభుత్వం అవకాశం కల్పిం చింది. దీని వలన 150 చదరపు గజాల వరకు అన్ని అర్హతలు కలిగిన వారికి ఉచితంగా డీ-పట్టా మంజూరు చేయడం జరుగుతుంది. అయితే ఇక్కడే అసలు సమస్య ఉన్నది. సీలింగ్ భూమి అయినప్పటికీ ఏదో ఒక సర్వే నంబరుతో భూ అనుభవదారులు ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయిం చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు వాటికి డీ-పట్టా తీసుకొంటే మార్కెట్ విలువ పతనం అయిపోతుంది. గుంటూరు జిల్లా పరిధిలో 3600 సీలింగ్ భూములున్నట్లు అంచనా వేస్తున్నారు. క్రితంసారి అవకా శం కల్పించినప్పుడు 800 మంది వరకు దరఖాస్తు చేసుకొన్నారు. వాటిల్లో 300లకు పైగా విచారణ పూర్తయి ప్రభుత్వానికి వెళ్లాయి. కాగా ప్రస్తుతం 2800 వరకు ఉన్నాయి. వీటిల్లో 1700 మంది భూములు 150 చదరపు గజాల లోపే ఉన్నాయి. వీళ్లంతా క్రమబద్ధీకరించుకోవడానికి ముందుకు రావడం లేదు. ఇందుకు కారణం ప్రస్తుతం వాళ్ల భూములు రిజిస్ట్రేషన్ అయి ఉండటమే. ఈ నేపథ్యంలో వీళ్లకు కూడా ఎంతో కొంత చార్జీలు నిర్ణయించి రిజిస్ట్రేషన్ చేస్తేనే ముందుకొస్తారు. కాగా 150 నుంచి 300 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 15 శాతం చెల్లించుకొని రిజిస్ట్రేషన్ చేస్తారు. 300 నుంచి 500 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 30 శాతం, 500 చదరపు గజాల కంటే ఎక్కువ ఉంటే 100 శాతం బేసిక్ విలువ చెల్లించాలి. వీళ్లందరికి కన్వేయన్స్ డీడ్స్ ఇస్తారు. అలానే భూములను సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేయించుకొనే వెసులుబాటు ఉంటుంది. అంతేకాకుండా వాటిని నిషేధిత భూముల జాబితా నుంచి కూడా తొలగిస్తారు. అయితే ఈ వెసులుబాటు 150 చదరపు గజాల లోపు వాళ్లకి కల్పించకపోవడం వలన పెద్దగా భూయజమానులు ముందుకొచ్చే పరిస్థితి జిల్లాలో లేదు.

పశ్చిమ డెల్టాకాల్వకు 1616 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1616 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.1 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 130, తూర్పుకాల్వకు 251, పశ్చిమకాల్వకు 160, నిజాంపట్నంకాల్వకు 110, కొమ్మమూరుకాల్వకు 666 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి తాళం, భజన పోటీలు

తాడికొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భారతదేశ సాంస్కృతిక, సంప్రదాయాలను నేటితరం మర్చిపోతున్న తరుణంలో సాంస్కృతిక కళాశాలలను కాపాడాలనే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయి తాళం, భజన పోటీలను నిర్వహిస్తున్నట్లు తాడికొండ భవాని పీఠ వ్యవస్థాపకులు కొల్లిపర నాగకోటేశ్వరశర్మ తెలిపారు. తాడికొండలోని కొల్లిపర వెంకటసుబ్బమ్మ సాంస్కృతిక కళాశాల ఆధ్వర్యంలో మార్చి 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 17వ తేదీన తాడికొండ కార్యాలయంలో హాజరుకావాలని కోరారు. వివరాలకు 9849986616లో సంప్రదించాలని కన్వీనర్ ఏ కోటేశ్వరరావు పేర్కొన్నారు.

టీచ్ టూల్‌పై అవగాహనా సమావేశం

మంగళగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం టీచ్ టూల్‌పై అవగాహనా సమావేశం జరిగింది. టీచ్ టూల్ జిల్లా పరిశీలకుడు తోట వీరయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనలో సహాయం చేసేందుకు టీచ్ టూల్ ఉపయోగపడుతుందన్నారు. మండలంలో శిక్షణ పొందిన టీచ్ టూల్ సిబ్బంది సంబంధిత పాఠశాలలను సందర్శించి ఎస్‌సీఈఆర్‌టీ జారీ చేసిన నిబంధనల ప్రకారం మూడు వారాల్లోగా టీచ్ టూల్‌ను పూర్తిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈవో-2 ఎన్ బాబు, ప్రధానోపాధ్యాయులు ఎస్ శ్రీనివాసరావు, యూ ఏడుకొండలు, ఎం వెంకటేశ్వర్లు, రిసోర్స్‌పర్సన్లు పేర్రాజు, సుందర రాజు, సాలార్ బేగ్, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రికవరీ బంగారం తక్కువ ధరకే ఇస్తానని కానిస్టేబుల్ మోసం

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): దొంగల నుంచి రికవరీ చేసిన బంగారం ఉందని, దానిని తక్కువ ధరకే ఇస్తామని చెప్పి కానిస్టేబుల్, ఆయన బావ కలిసి తన నుంచి నాలుగు లక్షల తీసుకొని మోసం చేశారని మంగళగిరి చెందిన షేక్ షాజహాన్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 2022లో పాగోటి గోవిందరావు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు అన్నారు. ఆ సమయంలో గోవిందరావు, ఆయన బావ శాంతారావు తన వద్దకు వచ్చి తాము దొంగల నుంచి రికవరీ చేసిన బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టామని, దాని ఖరీదు ఆరు లక్షలు ఉంటుందని నాలుగు లక్షలకే ఇస్తామని చెప్పి తన నుంచి డబ్బు తీసుకున్నారన్నారు. అయితే తన డబ్బుగానీ, బంగారం గానీ ఇవ్వకపోవడంతో పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో 2023లో పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. డబ్బులు అడుగుతుంటే కేసు ఉపసంహరించుకోవాలని, లేదంటే నీ అంతు చూస్తానని బెదిరిస్తున్నాడని బాధితురాలు ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం, గ్రామోత్సవం



గ్రామవీధుల్లో ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

దుగ్గిరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : దుగ్గిరాలలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు సాకేత్‌శర్మ, రామచంద్రల పర్యవేక్షణలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్వామి వారి సుప్రభాతసేవతో ప్రారంభమైన కార్యక్రమాలు నవనీత హారతి, పారమార్థిక హోమం, ఆలయ బలిహరణ, నవకుంభారాధన, నిర్వహించారు. 3 గంటలకు స్వామివారి గరుడోత్సవం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ వీధుల్లో అడుగడుగునా భక్తులు స్వామికి హారతులిచ్చారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు.

ప్లాస్టిక్ వినియోగదారులకు జరిమానా

మంగళగిరి సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తున్న దుకాణాలపై ప్రభుత్వ యంత్రాంగం వరుసగా దాడులు నిర్వహిస్తుంది. సచివాలయ సిబ్బంది బృందాలుగా విడిపోయి దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎంటీఎంసీ పరిధిలో మంగళవారం 46 కిలోల ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేసి, రూ.5 వేల జరిమానా విధించామని సిబ్బంది తెలిపారు. ఇప్పటివరకు 390 కిలోల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుని, రూ.39,600 జరిమానా విధించినట్టు చెప్పారు. ప్రజలు, వ్యాపారులు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు.

జనసేన ఆవిర్భావ సభ విజయవంతం చేయాలి

కాకుమాను, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం కాకుమాను జనసేన పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.

వృథా అవుతున్న తాగునీరు

● గ్రామాల్లో కుళాయిల నిర్వహణ అధ్వానం
● చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



రావెల ఎస్సీకాలనీలో వాటర్ ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు

తాడికొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అసలే వేసవి కాలం.. ఆపై తాగునీటి ఎద్దడి... అన్నీ తెలిసి మంచినీటిని వృథా చేయడం అటు అధికారులకు, ఇటు గ్రామస్థులకు ఏమాత్రం సమంజసమో ఆలోచించాల్సిన అవసరం ఉంది. మండలపరిధిలోని గ్రామాల్లో పంచాయతీ అధికారులు సరఫరా చేసే తాగునీరు వీధి కుళాయిలు, వాటర్ ట్యాంకుల నుంచి ఇలా తరచూ వృథాగా పోతున్నాయి. కుళాయిలు కట్టేయకుండా నీటిని వృథాగా వదిలేస్తున్నా.. స్థానికులు, పంచాయతీ సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవ హరిస్తున్నారని ఫిర్యాదు లు వస్తున్నాయి. చాలా కాలంగా గ్రామాల్లో ఈ తంతు కొనసాగడం గమనార్హం. పలు గ్రామాల్లో హెడ్‌లు లేని కుళాయిలు ఉన్నాయి. దీంతో వృథాగా నీరుపోతుంది. దీని వల్ల కుళాయిల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉంటు న్నాయని మహిళలు చెబుతున్నారు. దోమలు వృద్ధి చెంది వ్యాధులు వస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుళాయిల వద్ద క్లోరినేషన్ చేయటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచు కొని ఇకనైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



పెదవడ్లపూడిలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న కూటమి నాయకులు



చిర్రావూరులో చెక్కు అందజేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన నగదు చెక్కులను స్థానిక కూటమి నేతలు మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కంచర్ల సునందినికి రూ.5,80,233లు, నందికొల్ల వసంత లక్ష్మీకి రూ.2,02,209, గుమ్మడి శివప్రసాద్‌కు రూ.64,692, భావన అభిరామ్‌కు రూ.41,174, కొండపల్లి కృష్ణకు రూ.37,292, పామారి దుర్గాప్రసాద్‌కు రూ.30 వేల చొప్పున చెక్కులు మంజూరు కాగా, నేతలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, జనసేన గ్రామ అధ్యక్షుడు నడవన దుర్గారావు, నేతలు మాదల రమేష్‌బాబు, బోయపాటి రమేష్, జాలాది సందీప్, కంచర్ల బద్రి తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో..

తాడేపల్లి (చిర్రావూరు), మార్చి 10(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం చిర్రావూరులో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును సోమవారం లబ్ధిదారులకు టీడీపీ నేతలు అందజేశారు. తాడేపల్లి మండలం, టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు అమరా సుబ్బారావు, సామల నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామానికి చెందిన బాధితులకు చెక్కును అందజేశారు. టంకసాల సాయికిరణ్ మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో కిరణ్ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.5,75,762లు చెక్కును అందజేశారు. అలాగే పరిమిశెట్టి నాగబాబు అనే బాలుడు అనారోగ్యం బారిన పడడంతో వారికి రూ.46,962లు మంజూరైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాసరగడ్డ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి పిల్లి రమేష్, మొక్కపాటి ఏసుప్రసాద్, వెంకట కృష్ణారావు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు అంకం కాళీకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి లాల్ చందు తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి మండలం మెల్లెంపూడికి బొమ్మారెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కామినేని వెంకట రమణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు మంత్రి లోకేశ్‌కు దరఖాస్తు చేసుకోగా అందు నిమిత్తం వేణుగోపాల్‌రెడ్డికి రూ.1,16,500లు, కామినేని వెంకటరమణకు రూ.99,736లు మంజూరు చేశారు. ఈ చెక్కులను మెల్లెంపూడి గ్రామ టీడీపీ నాయకులు షేక్ నాగూర్, పఠాన్ ఖాసిం ఖాన్, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, సొంటి కళ్యాణి, షేక్ ఖాసిం బాబు, సొంటి రామ్మోహనరావు, కంచర్ల లెనిన్ బాబు, కంచర్ల రాంబాబు, షేక్ నూరుద్దీన్, పఠాన్ నాగుల్‌మీరా, కాటూరి పావని, మారెం శ్రీనివాసరావు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ పరిధి నుంచి రైతుల భూములను మినహాయించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 10(ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు మండలం చమళ్ళమూడి, మేడికొండూరు మండలం జంగంగుంట్ల, మేడికొండూరు గ్రామాలకు చెందిన రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మేడా హనుమంతరావు, రెంటాల కుమారి, రైతులు కొడాలి నాగేశ్వరరావు, తలపనేని స్టాలిన్ తదితరులు ఉన్నారు.

● తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన 7 మంది దళిత రైతుల లంకా భూములను అన్యాక్రాంతం చేసి అక్రమంగా రాయించుకున్న రాయపాటి ఏడుకొండలను శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. రైతులు కంభంపాటి దేవుని దయ, లక్ష్మి, బుల్లెమ్మ, ఉబ్బపల్లి కోటేశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

● తుళ్లూరు మండలం పెదపరిమి సెంటర్, నెక్కళ్ల గ్రామల మధ్య ఉన్న రోడ్డు గుంతలమయంగా మారిందని దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు జన జాగృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో రావెల సాంబశివరావు, ఆలూరి సాంబశివరావు, బాబు, పద్మ తదితరులున్నారు.

● పూర్వీకుల నుంచి సంక్రమించుకున్న 5 సెంట్ల గ్రామ కంఠాన్ని మండల అధికారుల సాయంతో కొంత మంది స్థానికులు పోరంబోకు స్థలంగా మార్చి ఆక్రమించుకున్నారని ఫిరంగిపురం మండలం, అమీనాబాద్‌కు చెందిన పీ వెంకటేశ్వరరావు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. ఈ స్థలాన్ని వాహనాల పార్కింగ్‌కు ఉపయోగిస్తున్నారని, అదేమని అడిగితే బెదిరిస్తున్నారని వాపోయారు.

ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఆలయ ధర్మకర్త లక్ష్మీకాంతం

ఫిరంగిపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులగడ్డలో ఉన్న శ్రీసీతా రామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం ఆలయ ధర్మకర్త లక్ష్మీకాంతం శంకుస్థాపన చేశారు. కామన్ గుడిఫండ్ నుంచి రూ.80 లక్షలు, ఆలయ ధర్మకర్త రూ.40 లక్షతో చేపట్టనున్నామని దేవదాయ ధర్మదాయ శాఖ ఈవో శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, భక్తులు పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉండాలి

● భాష్యం స్ప్రింగ్ ఫెస్ట్‌లో వక్తలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, చిత్రంలో భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), మార్చి 10(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి ఎప్పుడు సంసిద్ధంగా ఉండాలని, అప్పుడే ఉన్నత విజయాలు సాధించగలమని ప్రముఖ వైద్యుడు జీ కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. సోమవారం భాష్యం ఐఐటీ ఫౌండేషన్ అకాడమీ ఆధ్వర్యంలో గోరంట్ల భాష్యం రామసేతు క్యాంపస్‌లో జరిగిన స్ప్రింగ్ ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు సాధించే క్రమంలో ఒత్తిడి సహజమని ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, ప్రణాళికాబద్ధంగా దినచర్యను రూపొందించుకుంటే దీనిని అధిగమించవచ్చు న్నారు. మరో అతిథి ప్రముఖ గైనకాలజిస్ట్, డాక్టర్ పద్మజ మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో విలువైందని, సెల్ ఫోన్స్, సోషల్ మీడియా వంటి వాటికి బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి భాష్యం విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. అతిథుల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య ఏపీజే అబ్దుల్ కలాం

● ఏఐ సహకారంతో సృష్టించిన ఎన్ఆర్ఐ విద్యార్థులు



డేటా సైన్స్ విద్యార్థులు ఏఐ ద్వారా రూపొందించిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం

మేడికొండూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవ త్సరం విద్యార్థులు ఏఐ ద్వారా మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను సృష్టించారు. ఎన్ఆర్ఐ కళాశాల ఫెస్ట్ సందర్భంగా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెంట్ ద్వారా రూపొందించిన అబ్దుల్ కలాం వీడియోను సోమవారం ప్రదర్శించారు. సభలో విద్యార్థులు, అధ్యాపకుల మధ్యలో అబ్దుల్ కలాం కూర్చొని మాట్లాడుతున్నట్టు వీడియోను రూపొందించారు. చూస్తున్న వారికి అబ్దుల్ కలాం మాట్లాడుతున్నట్టు డేటా సైన్స్ విద్యార్థులు విష్ణువర్ధన్, మణికంఠ, బాలాజీ, శివారెడ్డి, తేజస్విని తమ నైపుణ్యత ప్రదర్శించారని కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్ తెలిపారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు మాట్లాడుతూ ఏఐ సహకారంతో అబ్దుల్ కలాంను సృష్టించిన డేటా సైన్స్ విద్యార్థుల కృషి అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో డేటా సైన్స్ హెచ్‌వోడీ కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి, ఏవో సీతారామయ్య తదితరులతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుర్రా శరత్ చంద్ర తదితరులు అభినందించారు.

యాంత్రీకరణతోనే వ్యవసాయం లాభసాటి

కాకుమాను, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆధునిక యంత్రాలను వాడడం ద్వారానే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం గుంటూరు డీఎన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ కరుణాసాగర్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని అప్పాపురం, రేటూరు గ్రామాల్లో వారం రోజులుగా జాతీయ సేవా సంస్థ(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. డాక్టర్ ఎన్టీఆర్ అగ్రికల్చరల్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల (బాపట్ల) డీన్ డీడీ స్మిత్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం రంగం సంక్షోభంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీనిధి రుణాల్లో అక్రమాలు

● న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

మేడికొండూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలలోని మహిళల నిరక్షరాస్యతను ఆసరాగా తీసుకొని శ్రీనిధి రుణాల్లో కొందరు యానిమేటర్లు అక్రమాలకు పాల్పడుతున్నారని డ్వాక్రా సభ్యులు ఆరోపిస్తున్నారు. తాజాగా శ్రీనిధి రుణాలు తీసుకొని తాము చెల్లించినా ఇంకా బకాయిలున్నట్టు అధికారులు చెప్పడంపై మండలంలోని కొందరు డ్వాక్రా మహిళలు సోమవారం గుంటూరు వెళ్లి ప్రజావేదిక ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మేము సక్రమంగా చెల్లిస్తున్నా బకాయిలు ఎందుకు ఉంటున్నాయని రుణాలు పొందిన సభ్యులు నిలదీస్తున్నారు. దీనికి సమాధానం చెప్పేవారు లేకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సభ్యులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సమష్టి కృషితో ప్రమాదాలను నివారించవచ్చు

● డిప్యూటీ జనరల్ మేనేజర్ కోట రఘురాం

మేడికొండూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమష్టి కృషితో పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించవచ్చునని జోసిల్ లిమిటెడ్ డీజీఎం కోట రఘురాం చెప్పారు. 54వ భద్రత వారోత్సవాల సందర్భంగా మండలంలోని డోకిపర్రులోని జోసిల్ లిమిటెడ్ ఆవరణలో సోమవారం జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల్లో తాము పనిచేస్తున్న ప్రాంతంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రమాదం జరిగే అవకాశం ఉందనిపిస్తే నిర్లక్ష్యంగా వదిలి వేయకూడదని వెంటనే భద్రత కమిటీకి తెలియజేయాలని సూచించారు. మానవ తప్పిదం, ఊహించని ప్రమాదాల వల్ల ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉన్నందున భద్రతపై తమ సంస్థ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్మికుల కృషి ఫలితంగా ప్రమాద రహిత పరిశ్రమగా జోసిల్ నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కుందుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జోసిల్ ఉద్యోగులు భద్రతా ప్రమాణాలను అన్నివేళలా పాటించాలని చెప్పారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలలో ద్విచక్రాలపై ప్రయాణించేవారు తలకు గాయాలై మరణిస్తున్నారని, తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కంపెనీ అడ్వైజర్లు రామినేని బెనర్జీ బాబు, భానుప్రసాద్, మేనే జర్ షేక్ జానీ బాషా, ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన హల్ ఎహ్ సాన్ ఫౌండేషన్ సహకారంతో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. యర్రబాలెం బసవతారకనగర్‌లో ఫౌండేషన్ కన్వీనర్ మహమ్మద్ బకియతుల్లా ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి 15 కిలోల బియ్యం, రెండు కిలోల పచ్చి శనగపప్పు, కిలో చింతపండు, కిలో పంచదార, రెండు లీటర్ల నూనె, అరకిలో కారం, 200 గ్రాముల పసుపు, 200 గ్రాముల డాల్డా కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు నాయుడు నాగరాజు (ఇస్మాయిల్), షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ చెప్పారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందని సీఎం చంద్రబాబు మహిళా దినోత్సవం రోజున తెలిపారని గుర్తు చేశారు. మహిళా సంక్షేమం, సాధికారత, భద్రత కోసం వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారని, వాటిని కూటమి ప్రభుత్వం అమలు పరుస్తుందని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజా మాష్టారు మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో హక్కు, స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించారన్నారు. అదేస్ఫూర్తితో మహిళలను ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో భీమినేని వందనాదేవి, కంచర్ల శివరామయ్య, మద్దిరాల గంగాధర్, మేళం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పాపులేషన్ డైనమిక్స్ సదస్సు

● హాజరుకానున్న సీఎం చంద్రబాబునాయుడు

మంగళగిరి సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మంగళవారం పాపులేషన్ డైనమిక్స్ అండ్ డెవలప్‌మెంట్‌పై సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సీఎం చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుల్లో వివిధ రంగాల ప్రముఖులు, ఐఏఎస్ అధికారులు, ప్రభుత్వ కార్యదర్శులు, జనాభా పెరుగుదల, అభివృద్ధి అంశాలకు సంబంధించిన నిపుణులు వస్తారు. సాయంత్రం 4గంటలకు సీఎం చంద్రబాబు యూనివర్సిటీకి చేరుకుని సదస్సులో ప్రసంగిస్తారని ప్రణాళికా శాఖ కార్యదర్శి అనంత శంకర్ తెలిపారు. యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, ప్రెసిడెంట్ డాక్టర్ పీ.సత్యనారాయణన్, వైస్‌చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా, రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్, సదస్సు నిర్వహణా కమిటీ చైర్మన్ ఆచార్య డి.నారాయణరావులు సదస్సు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సుమారు రూ.700 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే నూతన భవన నిర్మాణాలకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి



అధికారులతో కలిసి సీఎం చంద్రబాబు పర్యటనా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టరు

మంగళగిరి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మంగళవారం జరుగనున్న పాపులేషన్ డైనమిక్స్ సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కలెక్టర్ నాగలక్ష్మి జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, సీఎం భద్రతా సిబ్బందితో కలిసి సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న సీవీ రామన్ బ్లాక్, ప్రసంగించనున్న అబ్దుల్ కలాం ఆడిటోరియం ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ నారాయణరావు, ఈడీ ప్లానింగ్ వీఆర్ అలపర్తి, సెక్రటరీ అనంత్‌సింగ్, వర్సిటీ రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్‌కుమార్, సీఎల్ఎం డైరెక్టర్ అనూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు అధికారులు డుమ్మా..

● ప్రభుత్వ లక్ష్యానికి అధికారులు తూట్లు
● ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపమే కారణం



గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరైన 9శాఖల అధికారులు

పెదనందిపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతి సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రభుత్వ లక్ష్యం గొప్పగానే ఉన్నా, అధికారుల్లో నెలకొన్న నిర్లక్ష్యంతో నీరుగారుతుంది. దీంతో మండలంలో ప్రజాసమస్యల పరిష్కారం సాధ్యపడడంలేదు. వారానికి ఒక్కపూట కూడా అధికారులు ప్రజల సమస్యలు వినడానికి సమయాన్ని కేటాయించలేక పోతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఐదారు శాఖలు మినహా మిగిలిన శాఖలకు సంబంధించి ఏ అధికారి ముఖం కూడా చూపడం లేదు. ఆయా శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు క్రిందిస్థాయి సిబ్బందిని పంపి మమ అనిపిస్తున్నారు. 24 శాఖలకు గానూ 9మంది అధికారులే హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు వినతులు ఎవరికి ఇవ్వాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఉన్నతస్థాయి అధికారులు పలుమార్లు మెమోలు జారీ చేసినా అధికారుల తీరు మారట్లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దాతల సాయాన్ని వినియోగించుకోవాలి : ఎంఈవో



పాఠశాలలో దాతలు అందజేసిన పరీక్ష కిట్లతో పదో తరగతి విద్యార్థులు

కాకుమాను, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి దాతలు అందజేస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ ఆకాంక్షించారు. కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామానికి చెందిన ఉప్పుటూరి రామ్(ఎన్ఆర్ఐ) సహాయంతో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కొల్లి విజయభాస్కర్, హెచ్ఎం సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు దాత రామ్‌చౌదరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళా సాధికారతకు సావిత్రిబాయి పూలే కృషి ఎనలేనిది

కాకుమాను, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానికి పూర్వమే మహిళా సాధికారతకు సావిత్రి బాయిపూలే చేసిన కృషి ఎనలేనిదని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ శ్లాఘించారు. సోమవారం గరికపాడు రంగానగర్ కాలనీలో ఎంపీపీ పాఠశాలను వార్షిక తనిఖీ నిర్వహించి పూలే వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి):** స్థానిక శాఖ గ్రంథాలయంలో సావిత్రి బాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి సుభాషిణి మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవానికి సావిత్రిబాయి ప్రతీకగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు, శివయ్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

● **దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి) :** దుగ్గిరాలలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సావిత్రీ బాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి ప్రధానోపాధ్యాయిని ఎస్ శోభాదేవి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్త్రీవిద్యతోనే మహిళాభివృద్ధి, తద్వారా కుటుంబాభివృద్ధి సాధ్యమని గుర్తించి, చైతన్యం తీసుకువచ్చేందుకు అహర్నిశలు శ్రమించిన సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని విద్యార్థినులందరూ చదువులో ప్రతిభను చాటాలన్నారు. ఉన్నతాశాయాలతో పలురంగాల్లో విజయాలు సాధించి, అగ్రగామిగా నిలిచిన మహిళలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

ఏఎన్‌యూ ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం

పెదకాకాని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సీఎస్ఆర్ విభాగం ద్వారా శిక్షణ పొందిన మహిళా పునరావాస కేంద్రం (జేఎంజేశక్తి సదన్ ఉజ్వల హోమ్) మహిళలు తయారుచేసిన పలు ఉత్పత్తుల ప్రదర్శనను సోమవారం రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో ఈ నెల 17 వరకు అమ్మకం కొనసాగుతుందని కేంద్రం సంచాలకురాలు డాక్టర్ బి.బబిత చెప్పారు. కార్యక్రమంలో ఆచార్య కేవీ శాంతిశ్రీ, హోమ్ నిర్వాహకురాలు రోజ్ రీనా, ఎమ్.రూప తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

తెనాలి అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్ కోరారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సోమవారం పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా విద్యార్థుల సమస్యలు పట్టకపోవడం దురదృష్టకరమన్నారు. యువగళం పాదయాత్ర పేరుతో పెట్టిన సమావేశాల్లో కూడా మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించలేదని చెప్పారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను ఇంతవరకు రద్దు చేయలేదన్నారు. కార్యక్రమంలో శివ, రవి, అఖిల్, తేజ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తెనాలి క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ముత్తింశెట్టిపాలెం బట్టావారి వీధిలో జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. నీరుడు శివ(43) మద్యానికి బానిసయ్యాడు. ఏడు సంవత్సరాలుగా లివర్ సమస్యతో ఇబ్బందిపడుతున్నాడు. మద్యం తాగటానికి డబ్బులు కావాలని భార్యని ఒత్తిడి చేశాడు. భార్య డబ్బులు ఇవ్వడానికి నిరాకరించింది. భార్య ఇతర పనులపై బయటకువెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు

ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి

కొల్లిపర, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూర పంటలను కొల్లిపర మండల మోడల్ టీమ్ ప్రదర్శనకు ఉంచారు. ఈ సంద్భంగా రైతులకు ప్రకృతి సాగుపై అవగాహన కలిగించారు. మాధవి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వలన అనేక ఉపయోగాలు ఉన్నారన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జీలు నాగజ్యోతి, సుధారాణి, ఎంటీలు పరిశుద్ధకుమారి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

కొల్లిపర, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కొల్లిపరలోని శ్రీదేవి భూదేవి సమేత జనార్థన స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం పండితులు జగన్నాధాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ, యోగానంద పృథ్వీబార్గవ్, వీరభద్రేశ్వరశర్మ, వెంకటేశ్వర శర్మ, సీతారామాచార్యులు, నాగరాజుశర్మలు స్వామివారికి వివిధ అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి పూర్ణాహుతి, ధ్వజావరోహణ వంటి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గ్రామంలో ఊరేంపు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేద్దాం

మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న వైసీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఈ నెల 12న నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హ్యాకింగ్ మోసాలపై ఓటీటీ చిత్రం

తెనాలి అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, హ్యాకింగ్ మోసాలపై ఓటీటీ చిత్రం నిర్మిస్తున్నామని సినీ దర్శకుడు దిలీప్‌రాజా చెప్పారు. సుల్తానాబాద్‌లోని మా ఏపీ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా రోజు రోజుకు సైబర్ నేరాల సంఖ్య పెరుగుతుందన్నారు. పోలీసుశాఖకు కూడా సవాల్‌గా మారిన సైబర్‌నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు అవగాహన కల్పించేందుకు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తెనాలి, మారీసుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహన దారుడికి గాయాలైన ఘటన స్థానిక బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలి నుంచి నందివెలుగు వెళుతున్న ద్విచక్రవాహనం బస్టాండ్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆటోని ఢీకొని అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో గాయపడిన బాధితుడిని స్థానికులు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న శానిటేషన్ సిబ్బందితో అన్నారు. సోమవారం స్థానిక 14వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంలో రోడ్ల వెంబడి ఉన్న చెత్తను గమనించి వ్యర్థాలను పూర్తిగా డంపింగ్ యార్డులకు తరలించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శానిటేషన్ అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ శేషన్న

సకాలంలో పన్నులు చెల్లించండి

మునిసిపల్ పన్నులను సకాలంలో చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న ప్రజలను కోరారు. స్థానిక 14వ వార్డులో సోమవారం షాపుల ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్స్‌ను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘానికి చెల్లించవలసిన ఇంటి, ఖాళీ స్థలాల, నీటి పన్నులను నిర్ణీత గడువులోపు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. వ్యాపార సంస్థల యజమానులు తమ సంస్థల ట్రేడ్ లైసెన్స్‌లను సకాలంలో రెన్యూవల్ చేయించుకోవాలని నూతనంగా షాపులను ఏర్పాటుచేసిన వారు కొత్తగా లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. పురపాలక సంఘ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురపాలక సంఘానికి నాలుగు అర్జీలు

పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం మునిసిపల్ కమిషనర్ బి.శేషన్న నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు అందినట్లు కమిషనర్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి ఒకటి, రెవెన్యూ విభాగానికి ఒకటి ఇంజనీరింగ్ విభాగానికి రెండు అర్జీలు వచ్చాయన్నారు. ప్రజల సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామని కమిషనర్ శేషన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి 4 అర్జీలు

తెనాలి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు అందినట్లు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. వాటిల్లో అడంగల్ కోసం ఒకటి, పింఛన్ కోసం మరొకటి, జగనన్న కాలనీలో సైట్ చూపించాలని ఒకటి, సర్వే కోసం ఒకటి వచ్చినట్లు వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమేష్‌బాబు

ప్లాస్టిక్ నిషేధానికి సహకారం అందించాలి

కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ఈనెల 15 నుంచి అమలుచేయనున్న ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై పట్టణంలోని వ్యాపార సంఘాలకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 15 నుంచి ప్లాస్టిక్ కవర్‌లను నిషేధిస్తున్నట్లు చెప్పారు. సింగిల్ యూజ్ కవర్‌లను వినియోగిస్తే అపరాధరుసుం విధించడంతో పాటు వ్యాపార అనుమతులు రద్దు చేయనున్నట్లు హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, వర్తక వ్యాపార సంఘాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు మూడు ఫిర్యాదులు

పొన్నూరు టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు స్థల ఆక్రమణ, అడంగల్ సవరణ, సర్వేకోసం ఒక్కొక్క ఫిర్యాదు అందాయి. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్స్ సురేష్‌కుమార్, వీరయ్య, సమన్వయకర్త త్రిమూర్తిరావు తదితరులు

మహిళల విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే కృషి

● ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్

పెదకాకాని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళల విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే అహర్నిశలు కృషి చేశారని ఏఎన్యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ వెల్లడించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం సావిత్రీబాయి పూలే 128వ వర్థంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్ మాట్లాడుతూ కులవ్యవస్థ, పితృస్వామిక వ్యవస్థ, అంటరానితనానికి వ్యతిరేకంగా సావిత్రీబాయి పూలే రాజీలేని పోరాటం చేశారన్నారు. మరొక ముఖ్యఅతిథి ఏఎన్‌యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వీరయ్య మాట్లాడుతూ దేశంలో బాలికల కోసం తొలి పాఠశాల నెలకొల్పిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు.పూలే అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఆచార్య త్రిమూర్తిరావు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలితో పాటు గొప్ప సమాజ సేవకురాలుగా సావిత్రీబాయి పూలే పేరు తెచ్చుకున్నారన్నారు. అనంతరం సావిత్రీబాయి పూలే, మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య స్వరూపారాణి, మహిళా అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ పద్మజ, అంబేద్కర్ చైర్ ఆచార్యులు అశోక్ కుమార్, బాబు జగ్జీవన్‌రామ్ కేంద్రం సమన్వయకర్త ఆచార్య రత్నాకర్, ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పాటుపడిన సావిత్రీబాయి పూలే

పొన్నూరుటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానికి పూర్వమే మహిళ సాధికారతకు పాటుపడిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని ముదిరాజ్ ఐక్య మహాసభ అధ్యక్షుడు మాకాని రమేష్ అన్నారు. పట్టణంలో సోమవారం సావిత్రబాయి పూలే వర్ధంతి జరిగింది. పట్టణంలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి బీసీ సం ఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ 150 ఏళ్ల క్రితమే సావిత్రీబాయి పూలే భర్త సహకారంతో అణగారినవర్గాల మహిళల అభ్యున్నతికి పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు మురుగుల సాంబశివరావు, కోటయ్య, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఏనూరి చిన్నయ్య పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో...

స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సావిత్రీ బాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన ఉద్యమాలు తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళ సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యురాలు అంగలకుదురు దుర్గాభవాని, దేవరకొండ కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరమ్మ, ఆరేటి పూజిత, గుర్రపుశాల బుచ్చమ్మ, ప్రమీలా, షేక్ నజీరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం సావిత్రీబాయిపూలే కృషి

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళల విద్యకోసం, హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగంచేసి సమాజానికి ఆదర్శంగా నిలిచిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త, కవి సావిత్రీబాయిపూలే అని పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. సోమవారం తొలి మహిళా ఉపాధ్యాయురాల సావిత్రిబాయిపూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, పార్టీ నాయకులతో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు పణిదపు దుర్గ, దంతాల ప్రేమ్ కుమార్, అన్నం పిన్నారావు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, శ్యాం, కావేటి వేణు, మల్లవరపు విజయ్‌కుమార్, సుభాష్, తవ్వా ప్రసాద్, కుదరవల్లి శ్రీనివాస్, చల్లగాలి శివరాజు, శివకేశవులు, విజయ్, రాజేంద్రప్రసాద్ పలువురు కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న కృష్ణ, విజయలక్ష్మి

జేఎంజే కళాశాలలో యువజనోత్సవాలు

తెనాలి అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జేఎంజే మహిళా కళాశాలలో రెండురోజులు యువజనోత్సవాలను సోమవారం సాహితీవేత్త బొల్లిముంత కృష్ణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ, విద్యార్థి దశలో విద్యతోపాటు ఇష్టం ఉన్న రంగాన్ని ఎంచుకుని రాణించాలన్నారు. నేటి ప్రపంచంలో నైపుణ్యాలు లేనిదే ఉపాధి అవకాశాలు లభించడం లేదన్న విషయాన్ని విద్యార్థులు గుర్తు పెట్టుకోవాలన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ హెచ్‌వోడీ ఎన్.విమలాదేవి, జె.శ్రీనివాస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కన్వీనర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ షైనీ, మేరీ శారద పర్యవేక్షించారు.



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

అమరజీవి పరిరక్షణ సమితి నియామకం

తెనాలి అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి ప్రతినిధులు నియామక పత్రాలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు అందజేశారు. సమితి జిల్లా కార్య నిర్వహణ అధ్యక్షుడిగా ఆలపాటి శివనరసింహారావును జాతీయ అధ్యక్షుడు గుడివాడ వేణుగోపాల్ నియమించారు. ఈ పత్రాలను సోమవారం ఆలపాటి చేతుల మీదుగా అందజేశారు. పొట్టి శ్రీరాములు త్యాగాలను భావి తరాలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. పొట్టి శంకర్, బాలగణేష్, పూర్ణచంద్రరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు చాలా బాగుంది

● ఫ్రాన్స్ బృందం ప్రశంసలు

కొల్లిపర, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టడం చాల బాగుందని ఫ్రాన్స్ ప్రతినిధుల బృందం సభ్యురాలు బెర్నీస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దావులూరిపాలెం, అత్తోట గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరల పంటలను ఫ్రాన్స్‌కు చెందిన ప్రతినిధుల బృందం సభ్యులు బెర్నీస్, ఫైలిన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండించే 365 రోజుల కిచెన్ గార్డెన్, న్యూట్రి గార్డెన్, ఏ గ్రేడ్ తదితర పంటలు రైతులు అనుసరించే పద్ధతుల గురించి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి వారికి వివరించారు. ఫ్రాన్స్ ప్రతినిధుల బృందం సభ్యులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరల సాగు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ హరినాధ్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయాధికారులు నాగలక్ష్మి, మాధవి, పాండురంగారావు, రజని, అవినాష్, అదిలక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అత్తోటలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న ఆకుకూరలను పరిశీలిస్తున్న ఫ్రాన్స్ బృందం



ఉడక పెట్టడానికి సిద్ధంగా ఉన్న పసుపు రాశులు

పసుపు రైతు ఉసూరు..

● భూమి పుచ్చు తెగుళ్లతో తగ్గిన దిగుబడి
● పెరిగిన సాగు ఖర్చు.. పడిపోయిన ధర
● పెట్టుబడి ఖర్చు కూడా రావడంలేదని రైతుల ఆందోళన

కొల్లిపర, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తెగుళ్ల ప్రభావంతో పంట దిగుబడి తగ్గిపోయింది.. మార్కెట్‌లో రేటు ఆశించిన మేర ఉండటం లేదు. పెట్టుబడి ఖర్చులు కూడా చేతికందే పరిస్థితి లేదు.. దీంతో పసుపు రైతులు దిగాలు చెందుతున్నారు.

మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, తూములూరు, హనుమాన్‌పాలెం, కొల్లిపర, అన్నవరం, అన్నవరంలంక, దావులూరిపాలెం గ్రామాల్లోని రైతులు 2 వేల 500 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. మంచి దిగుబడి వచ్చి, మార్కెట్‌లో రేటు ఉంటుందన్న ఆశతో పెట్టుబడులకు వెనుకాడలేదు. తొలుత పసుపు తోటలు కళకళలాడాయి. అనంతరం తోటలకు చీడపీడలు ఆశించాయి. సాధారణంగా పసుపుకు ఎటువంటి చీడ, పీడలు ఆశించకుండా ఉంటే ఎకరానికి 35నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. అటువంటిది తెగుళ్ల సోకడంతో ఈ ఏడాది ఎకరాకి 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఎండి పసుపు ధరను చూసి రైతులు నీరసించిపోతున్నారు. పంట వేసే సమయంలో క్వింటా రూ.14,500 ఉండగా, రూ.5 వేలు తగ్గి ప్రస్తుతం రూ.9,500 పడిపోయింది. ఈ ధరకు అమ్ముకుంటే పెట్టుబడి ఖర్చులు కూడా రావని రైతులు ఆవేదన చెందుతున్నారు.



దున్నిన పసుపును గంపలకు ఎత్తుతున్న కూలీలు

నష్టాల ఊబిలో పసుపు రైతులు ..

మంచి దిగుబడి వస్తే ధర లేకపోవడం, ధర ఉంటే దిగుబడులు లేకపోవడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ సంవత్సరం పసుపు పంట సాగు చేసినందుకు ఎకరానికి రూ.2 లక్షల 50 వేల నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి ఖర్చు అవుతుందని, ప్రస్తుతం పసుపుకు ఉన్న ధర, దిగుబడులు బట్టి పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ధర ఈ విధంగా ఉంటే మార్కెట్‌కు కొత్త పసుపు వస్తే ఇంకా ధర తగ్గుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం



స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

తెనాలి అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనామ పారాయణ, మహాయజ్ఞ పూర్ణాహుతి మహోత్సవాలలో సోమవారం శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని తాలూకా జూనియర్ కళాశాల ఆవరణలో భారీ స్థాయిలో నిర్మించిన వేదికపై నిర్వహించిన కల్యాణాన్ని భక్తులు కన్నుల పండువగా నిర్వహించారు. గోపూజ, కుంభారాధన, రామనామ మూల మంత్ర హోమం నిర్వహించారు. పసుమర్తి పద్మజకుమారి, నోరి నారాయణ మూర్తిలు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. సాయంత్రం జరిగిన సామూహిక సరస్వతి పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. విఖనస శ్రీనివాస ట్రస్ట్, పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు. ప్రముఖ అవధాన సరస్వతి పీఠాధిపతి మాడుగు నాగఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

టీడీపీ మహిళా నాయకురాలికి ఆర్థిక సాయం



టీడీపీ మహిళ నాయకురాలు నౌనహర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న మగ్బుల్‌బేగ్ తదితరులు

పొన్నూరు టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు షేక్ నౌనహర్‌కు సోమవారం రూ.15వేల ఆర్థిక సహాయాన్ని నాయకులు అందజేశారు. ఎమ్మె ల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు నౌనహర్‌కు అబ్దుల్ కలాం షాదీఖానా నిధులు రూ.10వేలు, అంజుమన్ కమిటీ నూతన అధ్యక్షుడు మగ్బుల్ బేగ్ రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్, షేక్ బాబ్జీ, హుస్సేన్, మహ్మద్‌గౌస్, షేక్ బాజీ సా హెబ్, ఇస్మాయిల్, మహ్మద్ బేగ్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోవర్ధన స్వామి ఆలయ ఉత్సవాలు



గోవర్ధనస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

తెనాలి అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గోవర్ధనస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధ్వజప్రతిష్ఠ, కుంభాభిషేక ఉత్సవాలు సోమవారం ముగిశాయి. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించిన రథంపై పట్టణంలో మేళతాళాలతో ఊరేగించారు. శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీగోవర్ధనస్వామికి శ్రీసువర్చలా సమేత వీరప్రతాప ఆంజనేయస్వామికి కల్యాణం నిర్వహించారు. కల్యాణ క్రతువును భక్తులు కన్నుల పండువగా తిలకించారు. ఈవో మల్లేశ్వరి, అర్చకులు రఘు, శ్రీనివాస దీక్షితులు, మాధవకుమార్, శివ, భాస్కరరావు తదితరులు పర్యవేక్షించారు.